ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి
# జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

మేడ్చల్ | శుక్రవారం | 17.07.2026 | సంపుటి : 2 | సంచిక : 16 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు



## యూకెతో ఆర్థిక ఒప్పందంతో అధిక ప్రయోజనం

### తెలంగాణకు అనుకూలంగా మలచుకుంటాం

### యుకెకు ఎగుమతులు పెంచుతాం: మంత్రి శ్రీధర్ బాబు

**భారత్- యునైటెడ్ కింగ్ డమ్ ల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం వల్ల తెలంగాణా గరిష్ఠ ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందం వల్ల దేశం నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై యుకె సుంకాలను తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు.**

హైదరాబాద్,జూలై16 : యుకె డిప్యూటి ట్రేడ్ కమిషనర్ చంద్రు కె అయర్ ఆధ్వర్యంలో గురువారం నాడు సచివాలయంలో తనను కలిసిన ప్రతినిధి బృందంతో శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం భారీగా వృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు. రెండు దేశాల మధ్య రూ.32.56 లక్షల కోట్ల వాణిజ్యానికి అవకాశం ఉందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణాలో

-మిగతా 2 లో..

# సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేస్తాం

## గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం

### నీటిని మళ్లించి జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటాం

### ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే కెసిఆర్ డబ్బులు వృధా

### సీతారామ ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన మంత్రులు

### ఖజనాపై భారం మోపారన్న డిప్యూటి సిఎం భట్టి



**గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు.**

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 16 : తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్టంగా సద్విని యోగం చేసుకుంటామని ప్రకటించారు. అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం

-మిగతా 2 లో..



## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన టీజీ20 లీగ్ విజేత

### విజేతలకు చెక్కులు అందచేసిన ముఖ్యమంత్రి

**టీజీ20 లీగ్ విజేతలైన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టు సభ్యులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన సీఎం, జట్టు సభ్యులకు విజేతల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు.**

హైదరాబాద్,జూలై16 : రాష్ట్రంలో క్రీడలకు ప్రాధా న్యం పెంచే లక్ష్యంతో కొత్త స్పోర్ట్స్ పాలసీని తీసు కొచ్చామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు స్పోర్ట్స్ యూనివ ర్సిటీని ఏర్పాటు చేశామని సీఎం వెల్లడించారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు, ప్రోత్సాహం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. టీజీ20 లీగ్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈ–ఛాంపి యన్స్ జట్టు రాష్ట్ర యువతకు ఆదర్శంగా నిలవాల ని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణకు పేరు తీసుకురావాలని సీఎం ఆకాం క్షించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని టీజీ 20 లీగ్ విజేత 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' ఫ్రాంచైజీ యాజ మాన్యం, జట్టు సభ్యులు కలిశారు. సీఎంను కలిసిన వారిలో రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, ఉ షోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశి వరావు, ఈటీవీ ఎండీ బాపినీడు, జట్టు సభ్యులు ఉన్నారు. టోర్నీ తొలి విజేతగా నిలిచిన 'హైదరాబాద్ ఈ ఛాంపి యన్స్' టీమ్‌కు సీఎం అభినందనలు తెలిపారు.



## సైబర్ నేరాలే భవిష్యత్తులో అతిపెద్ద సవాల్

### జీవితకాలపు పొదుపు కోల్పోతున్న అనేక కుటుంబాలు

### సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై సమీక్షలో డిజిపి ఆనంద్

హైదరాబాద్, జూలై 16 : సైబర్ నేరాలే భవిష్యత్తులో అతిపెద్ద సవాల్ అని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. వీటిని ఇప్పుడే నియంత్రిం చక పోతే తీవ్ర పరిణామాలు తప్ప వని హెచ్చరించారు. సైబర్ మోసాల తో కుటుంబాలు జీవితకాల పొదుపు కోల్పోతున్నారని పేర్కొన్నారు. గురు వారం డీజీపీ కార్యాలయంలో తెలం గాణ సైబర్

-మిగతా 2 లో..

# వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ

## ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక

### రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు అందించే లక్ష్యం

### కార్యాచరణ ప్రణాళికపై పుస్తక రూపంలో వివరాలు

### సచివాలయంలో ఆవిష్కరించిన మంత్రి తుమ్మల

**వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎల్‌నినోపై రాష్ట్ర తొలి శాస్త్రీయ కంటింజెన్సీ ప్లాన్ విడుదల చేస్తామని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఆయా మండలాలు, జిల్లాల వారీగా వర్షపాతం లోటు వివరాలు అందజేయాలని అధికారులకు సూచించారు.**



హైదరాబాద్,జూలై16 : రెండు నెలల వాతావరణ అంచనాల ఆధారంగా కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు. ఐఎండీ సమాచారంతో రోజువారీ వాతావరణ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. రైతులకు పంటల ఎంపిక, నీటి వినియోగంపై శాస్త్రీయ సూచనలు అందజేస్తామని చెప్పారు. ఆయా పంట నష్టాల నివారణకు అన్ని శాఖల సమన్వయం చేసుకుంటామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం వంటి ప్రతికూల పరిస్థితులను

-మిగతా 2 లో..

# గోల్కొండ కోటలో బోనాల ఉత్సవాలు

### అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు

### కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ పూజలు

### వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి సురేఖ

**గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రిగారికి అర్చకులు మంత్రోచ్ఛారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.**



హైదరాబాద్, జూలై 16 : బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

# ఎడ్యుకేషన్ జిహాద్‌పై బిజెపి ఆగ్రహం

### సైదాబాద్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

### బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు డిమాండ్



హైదరాబాద్, జూలై 16 : 'ఎడ్యూకేషన్ జిహాద్' ఉదంతాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి స్పష్టం చేశారు. ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షికమైన, సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. పాఠశాల యాజమాన్యంతో పాటు కారకులైన

-మిగతా 2 లో..



## 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

ఎంపిలకు కొత్త మార్గదర్శకాలు జారీ 04

## రిటైర్డ్ ఇంజనీర్లు సలహాలు ఇస్తే బెదిరింపులా?

### కరెంట్ లేక అల్లాడుతుంటే పట్టించుకోరా

### సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ హరీష్ రావు



హైదరాబాద్, జూలై 16 : రిటైర్డ్ ఇంజినీర్లు, తెలంగాణ సాగునీటి పారుదల శాఖ మేడిగడ్డ గేట్లు మూయకుండా కన్నెపల్లి గేట్లు ఎత్తొచ్చని చెప్తే.. ఆ నీళ్లు ఎత్తొచ్చని చెప్పిన ఇంజినీర్లను జైళ్లలో పెడతమని, బెల్ట్‌తో కొడ్తమని రాజకీయాలు చేస్తున్నది మీరని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన

-మిగతా 2 లో..



# గోల్కొండ కోటలో బోనాల ఉత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సమర్పణతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద దేవాలయాతో పాటు, చిన్న చిన్న దేవాలయాలకు కూడా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఆషాడ బోనాల ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సంతోషంగా అమ్మవార్లను దర్శించుకుని వెళ్ళేలా సకల ఏర్పాట్లను చేసినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# యూకెతో ఆర్థిక ఒప్పందంతో అధిక ప్రయోజనం

(మొదటిపేజీ తరువాయి)

పారిశ్రామిక వస్తూత్పత్తి, లైఫ్ సైన్సెస్, ఏవియేషన్, డిఫెన్స్, ఐటి, సెమికండక్టర్స్, చిప్ ల డిజైన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను వృద్ధి చేసామని, యుకె పారిశ్రామికవేత్తలు వీటిని వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రం నుంచి యుకెకు ప్రస్తుతం రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. కొత్త ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాల వల్ల ఎగుమతులను భారీగా పెంచుకునే అవకాశం ఏర్పడిందని వివరించారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం తెలంగాణాలోనే జరుగుతున్నాయని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో 30 శాతం రాష్ట్రానిదేనని శ్రీధర్ బాబు తెలిపారు. విమానయాన రంగానికి అవసరమైన ప్రిసిషన్ విడిభాగాల ఉత్పత్తిలో తెలంగాణా అగ్రస్థానంలో ఉందని గుర్తు చేసారు. ప్రపంచ ప్రఖ్యాత ఏవియేషన్ సంస్థలు ఎయిర్ బస్, బోయింగ్, రోల్స్ రాయిస్, విమాన ఇంజన్ల తయారీ సంస్థ ప్రాట్ అండ్ విట్నీస్, డసో ఏవియేషన్ ఉత్పత్తి చేసే రఫేల్ విమానాల విడిభాగాల తయారీ, ఓవర్ హాలింగ్ సదుపాయాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్స్, సఫ్రాన్ ఏవియేషన్ సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసారు. హైదరాబాద్ లో ఫార్చ్యూన్ 500 కంపెనీలతో సహా పలు ప్రఖ్యాత సంస్థలు 350 జిసిసి కేంద్రాలను ఏర్పాటు చేసాయని చెప్పారు. యుకెకు ఎగుమతి చేయగలిగే వస్తువుల తయారీపై స్థానిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి సిఇటిఎ ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఇండస్ట్రీస్ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆధిత్యకు శ్రీధర్ బాబు సూచించారు. యుకె నుంచి భారత్ పర్యటించే మేయర్ల బృందాన్ని హైదరాబాద్ ను కూడా సందర్శించేలా చూడాలని చంద్రు కె అయర్ ను మంత్రి కోరారు. అధికారులతో కలిసి యుకెను సందర్శించి అక్కడ పారిశ్రామిక, వాణిజ్య ఎకోసిస్టంను పరిశీలించాలని చంద్రు అయర్ శ్రీధర్ బాబును ఆహ్వానించారు. యుకె ప్రతినిధి బృందంలో సిద్దార్థ విశ్వనాథన్, నళిని రఘురామన్, ప్రవీణ్ పద్మనాభన్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలే భవిష్యత్తులో అతిపెద్ద సవాల్

(మొదటిపేజీ తరువాయి)

సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఎఐ ఆధారిత సైబర్ కాల్ సెంటర్ పని తీరుపై ప్రశంసలు కురిపించారు. సైబర్ ల్యాబ్, ఎస్ఒసి , డిజిటల్ ఫోరెన్సిక్, సోషల్ మీడియా యూనిట్లను ఆయన పరిశీలించారు. 2025లో సైబర్ మోసాల వల్ల రూ.1,524 కోట్ల ఆర్థిక నష్టం జరిగిందని వివరించారు. అయితే 2024తో పోలిస్తే నష్టాల్లో 20శాతం తగ్గుదల నమోదు అయిందని చెప్పారు. దేశవ్యాప్తంగా నమోదైన సైబర్ ఎఫ్ఐఆర్‌లలో 44 శాతం తెలంగాణలోనే నమోదు అయిందని చెప్పారు. రూ.255 కోట్ల నుంచి రూ.279 కోట్లకు బాధితుల నిధుల రక్షణ పెరిగిందని అన్నారు. ప్రతి నాలుగు ప్రధాన నేరాల ఎఫ్ఐఆర్‌లలో ఒకటి సైబర్ నేరానిదే అని స్పష్టం చేశారు. ఏఐ, డేటా అనలిటిక్స్‌తో సైబర్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆయన ఆదేశించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930కు కాల్ చేయాలని బాధితులకు సూచించారు. ఓటీపీ(క్షిఖ)లు, పాస్‌వర్డ్లు, బ్యాంకు వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని ప్రజలకు డీజీపీ సి.వి.ఆనంద్ హెచ్చరించారు. సేఫ్ సిటీతో హైదరాబాద్‌కు మరింత భద్రత ఉంటుందని డీజీపీ సి.వి.ఆనంద్ తెలిపారు. సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మహిళల భద్రతతోపాటు రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పోలీస్ - జీహెచ్ఎంసీతోపాటు వివిధ శాఖలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సీసీ టీవీ నిఘా వ్యవస్థను మరింత విస్తరించాలని సూచించారు. మొదటి దశలో 2,306 సీసీ టీవీలు... రెండో దశలో మరో 862 కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మరో 12 మొబైల్ షీ టాయిలెట్ల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. షీ టీమ్స్, భరోసా సెంటర్లను మరింత బలోపేతం చేయాలని సూచించారు. 404 ట్రాఫిక్ సిగ్నల్స్ పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 77 ప్రాంతాల్లో పాదచారుల సిగ్నల్స్‌పై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలన్నారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక నిర్వహణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, ట్రాఫిక్ భద్రతపై ఆడియో ప్రచార వాహనాలతో ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌తో హైదరాబాద్‌ను మరింత సురక్షిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

# సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీ-డిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీ-డిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూ-ర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం. ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం అని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమిషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కొనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రాణహితకు మళ్లీ ప్రాణం పోస్తాం

## సీతారామ, సీతమ్మసాగర్, దేవాదుల ప్రాజెక్టులు పూర్తి

- సాగునీటి రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం
- అడ్డంకులన్నీ తొలగించి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం,జూలై16 :** తెలంగాణ రైతాంగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాగునీటి రంగంలో చారిత్రాత్మక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టు, దేవాదుల ఎత్తిపోతల పథకాలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి రైతుల కలలను సాకారం చేస్తామని ఆయన ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సత్తుపల్లి టన్నెల్ వద్ద సీతారామ ప్రాజెక్టు పనులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించిన అనంతరం జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం అవసరమైన పర్యావరణ అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ప్రభుత్వం సమ-ర్థంగా పోరాడుతోందని, అవసరమైన అన్ని కేంద్ర అనుమతులు సాధించి చట్టబద్ధంగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన 67 టీఎంసీల గోదావరి జలాల వినియోగానికి కేంద్ర జల సంఘం తుది అనుమతి ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు పూర్తి మరింత వేగవంతం కానుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి సాగుభూమికి గోదావరి జలాలు అందించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, సాంకేతిక అంశాలన్నింటినీ వేగంగా పరిష్కరించి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనల మేరకు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కొనసాగుతోందని మంత్రి తెలిపారు. అన్ని పరీక్షలు పూర్తయి భద్రతా ధ్రువీకరణ లభించిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీరు నిల్వ చేయకుండానే తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో పంట పండించారని మంత్రి తెలిపారు. యాసంగి సీజన్‌లో సుమారు 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి దాదాపు రూ.19 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు దాదాపు రూ.80 వేల కోట్లకు పైగా నేరుగా చెల్లించినట్లు వెల్లడించారు.నీటిపారుదల శాఖలో వెయ్యికి పైగా ఇంజినీర్ల నియామకం, దాదాపు 1,800 మంది ఫీల్డ్ సిబ్బంది నియామకం, పెండింగ్ పదోన్నతుల మంజూరు వంటి చర్యలతో శాఖకు కొత్త ఊపు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. రైతుల శాశ్వత ప్రయోజనాల కోసం, ప్రజల భద్రత కోసం, శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే ప్రతి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు

# వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు అందించే లక్ష్యంతో వ్యవసాయ శాఖ రూపొందించిన 'తెలంగాణ వ్యవసాయ అత్యవసర / ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక వానాకాలం-2026' పుస్తకాన్ని తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకోవడానికి, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి, ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడానికి, పంటల సంరక్షణ చర్యలను చేపట్టడానికి ఈ పుస్తకం సమగ్ర మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. శాస్త్రీయ సమాచారం, వాతావరణ అంచనాలు, జిల్లా వారీ కార్యాచరణ ప్రణాళికలు, పంటల నిర్వహణ సూచనలను సమన్వయం చేస్తూ రూపొందించిన ఈ పుస్తకం రైతులకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భారత వాతావరణ శాఖ , భారత వ్యవసాయ పరిశోధన మండలి సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, అంతర్జాతీయ పంటల పరిశోధన సంస్థ, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ , భారత నూనె గింజల పరిశోధన సంస్థ నీటిపారుదల, విద్యుత్, భూగర్భ జల శాఖల సాంకేతిక సహకారంతో ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకంలో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాత విశ్లేషణ, వాతావరణ అంచనాలు, భూగర్భ జలాల పరిస్థితి, జలాశయాల నీటి లభ్యత, జిల్లా వారీ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు, పంటల నిర్వహణ పద్ధతులు, తేమ సంరక్షణ చర్యలు, విత్తనాల లభ్యత, రైతులకు అందించాల్సిన అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను సమగ్రంగా పొందుపరిచారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి,ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు సమయానుకూలంగా పంటల ఎంపిక, సాగు నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను అమలు చేయడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ పుస్తకం రాష్ట్రంలోని రైతులకు, వ్యవసాయ అధికారులకు, అనుబంధ శాఖలకు ఒక ప్రామాణిక మార్గదర్శక గ్రంథంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# నేటినుంచి రెండో విడత ఇంజనీరింగ్ కౌన్సిలింగ్

## ఖాళీ సీట్లలో రెండో విడతలో భర్తీకి ఏర్పాట్లు

**హైదరాబాద్,జూలై16 :** తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2026 రెండో విడత ప్రవేశాల కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసింది. శుక్రవారం 17వ తేదీ రెండో విడత అడ్మిషన్ల పక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. మొదటి విడత కౌన్సిలింగ్ ముగిసిన అనంతరం ఖాళీగా ఉన్న స్థానాలను ఈ విడత ద్వారా భర్తీ చేయనున్నారు. జూలై 17న ఆన్‌లైన్ ద్వారా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. జూలై 18న స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు హెల్ప్ లైన్ కేంద్రాలలో ధృవపత్రాల పరిశీలన జరుగుతుంది.జూలై 18 నుండి 19 వరకు: అర్హులైన అభ్యర్థులు తమకు నచ్చిన కాలేజీలు, కోర్సుల ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. జూలై 22న విద్యార్థుల మెరిట్, వెబ్ ఆప్షన్ల ఆధారంగా రెండో విడత తాత్కాలిక సీట్ల కేటాయింపును ప్రకటిస్తారు. మొదటి విడత కౌన్సిలింగ్ ముగిసిన తర్వాత భారీ సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. అధికారులు వెల్లడించిన గణాంకాల ప్రకారం మొదటి విడతలో సీట్లు పొంది, నిర్ణీత గడువులోగా కాలేజీలలో రిపోర్ట్ చేయని అభ్యర్థుల సంఖ్య 19,325 కాగా.. మొదటి విడత కౌన్సిలింగ్ పక్రియ ముగిసిన తర్వాత నేరుగా మిగిలిపోయిన ఖాళీ సీట్ల సంఖ్య 8,162. ఈ రెండు విభాగాలూ కలిపి రెండో విడత కౌన్సిలింగ్‌లో అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మొత్తం 27,487 సీట్లు ఉన్నాయి.

# ఎడ్యుకేషన్ జిహాద్‌పై బిజెపి ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని రాంచందర్ రావు పేర్కొన్నారు. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందంటూ ఆయన మండిపడ్డారు. ఇందుకు పాతబస్తీ సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్-ఫాతిహాలను చదివి రావాలని హోమ్‌వర్క్‌గా ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్' అని, రేవంత్ చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు. తమ బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, పాఠశాల యాజమాన్యాన్ని ధైర్యంగా నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ అని రాంచందర్ రావు పేర్కొన్నారు.

# రిటైర్డ్ ఇంజనీర్లు సలహాలు ఇస్తే బెదిరింపులా?

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ రైతులకు నీరందంచండి..కరెంట్ ఇవ్వండి..విద్యుత్ సామర్థ్యం ఉన్నది.. విద్యుత్ ప్లాంట్లు ఉన్నయి. బొగ్గు లేక విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. దృష్టి పెట్టండి అని ప్రభుత్వాన్ని ముల్లు కట్టె పెట్టి నిద్రలేపుతున్నాం. మీకు విషయాలు చెబుతున్నమన్నారు. రాజకీయాలు చేయడం మీరు మానండి.. విద్యుత్ ఉత్పత్తి పెంచండి.. రైతులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వండని ప్రభుత్వానికి హరీశ్ రావు సూచించారు.. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ చేస్తారట. కమిషన్ల కోసం గ్రీన్ ఎనర్జీ పాలసీని నిలిపేశారు. నాణ్యమైన బొగ్గును వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. దేవాదులకు నీళ్లు అందడానికి కారణం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కోతలు-వాతలు తప్ప ఏమీ లేవన్నారు. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ వేస్తారట. రైతులకు నీళ్లు ఇవ్వమంటే రక్తం పారిస్తామంటున్నారు. రెండు పంటలకు బోనస్ ఎగ్గొట్టారు. విద్యుత్ కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారు. విద్యుత్ సామర్థ్యం ఉన్నా ఉత్పత్తి చేయలేకపోతున్నారు. 7,180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంటే 3100 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం 33 శాతం మాత్రమే. ఎల్‌నినో వస్తుందని తెలిసినా ముందస్తు ప్రణాళిక లేదు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పారిశ్రామిక వేత్తలు, ప్రజలపై భారం పడుతోందన్నారు.

# గోల్కొండలో బోనాల సందడి

- డప్పు చప్పుళ్లు.. శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు
- గోల్కొండ అమ్మవారిని దర్శించుకున్న ఎంపి ఈటెల రాజేందర్



**హైదరాబాద్, జూలై 16:** తెలంగాణలో బోనాల సందడి మొదలయ్యింది. హైదరాబాద్‌లో బోనాల జాతర గురువారం ప్రారంభం అయ్యింది. డప్పు చప్పుళ్లు.. శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాల నడుమ సంప్రదాయ వస్త్రాల్లో మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకుని ఆలయాలకు కదిలే తరుణం వచ్చేసింది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించే బోనాల ఉత్సవాలు గోల్కొండ కోటలో ప్రారంభం అయ్యాయి. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకల కోసం.. హైదరాబాద్, రంగారెడ్డి, మల్కాజిగిరి పరిధిలోని సుమారు 3 వేలకు పైగా దేవాలయాల్లో అట్టహాసంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆషాఢ మాస బోనాల పండుగ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ నేత ఈటల రాజేందర్ గురువారం గోల్కొండ కోటలోని శ్రీశ్రీశ్రీ జగదంబ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించుకుని తెలంగాణ ప్రజలందరికీ ఆషాఢ మాస బోనాల శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఈటల రాజేందర్.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని అన్నారు. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సాంప్రదాయంలో వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ఆషాఢ మాసంలో తెలంగాణ రాష్ట్రంలోనే తొలి బోనాన్ని కుమ్మర సమాజానికి చెందిన మహిళలు గోల్కొండ జగదంబ మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. గోల్కొండలో తొలి బోనం సమర్పించిన అనంతరం లష్కర్ బోనాలతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రతి గల్లీ, ప్రతి ఇంట్లో బోనాలు సమర్పించే సంప్రదాయం కొనసాగుతుందని, ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల్లోనూ బోనాల వేడుకలు వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఆచారం వందల సంవత్సరాలుగా నిరంతరాయంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలందరూ అమ్మవారికి బోనం సమర్పిస్తూ.. అమ్మా.. పిల్లలను, పెద్దలను, మమ్మల్ని చల్లగా చూడు.. సుఖసంతోషాలతో జీవించే భాగ్యం కలిగించమని ప్రార్థిస్తారని ఈటల అన్నారు. భూతల్లి కరుణతో వ్యవసాయం, వ్యాపారాలు సుభిక్షంగా సాగాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలని భక్తులు మొక్కులు చెల్లిస్తారని చెప్పారు. గోల్కొండ బోనాల జాతర కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను సజీవంగా అందించే మహత్తర ఉత్సవమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కుమ్మర సోదరులు, అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా ఈ పండుగను ఘనంగా నిర్వహించడం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి నిదర్శనమని అన్నారు. ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలు సుఖశాంతులు, సస్యశ్యామలతతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## తెలంగాణలో ఆషాఢ బోనాల సందడి

### ప్రజలకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు



**హైదరాబాద్,జూలై16 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆధ్యాత్మిక విశ్వాసానికి అద్దం పట్టే ఈ వేడుకల ప్రారంభం సందర్భంగా నగర ప్రజలకు, భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బోనాల పండుగ సామాజిక ఐక్యతకు ప్రతీక అని కొనియాడిన ఆయన.. భక్తుల నమ్మకాలకు, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.20 కోట్ల నిధులను కేటాయించిందని గుర్తుచేశారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. త్సవాల నిర్వహణలో భాగంగా దేవాలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, నిరంతర తాగునీటి సరఫరా, నిరంతరాయ విద్యుత్, వైద్య సేవలతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, కట్టుదిట్టమైన భద్రత, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని వేలాది ఆలయాల్లో భక్తుల రద్దీని తట్టుకునేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ అధికారిక పర్యవేక్షణలో నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ బోనాల జాతరను విజయవంతం చేసేందుకు సర్వం సిద్ధమైంది



## జగన్నాథ రథయాత్రలో అపశృతి

- తొక్కిసలాటలో ఊపరిడక ఒకరు మృతి
- వందమందికి పైగా భక్తులకు గాయాలు

**పూరీ,జూలై16 :** ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రాండ్ రోడ్డులో రద్దీ విపరీతంగా పెరగడంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా 100 మందికి పైగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, రద్దీ విపరీతంగా పెరగడంతో ఓ వ్యక్తికి ఊపిరాడక స్పృహ తప్పిపోయినట్టు తెలిసింది. వెంటనే ఆ వ్యక్తిని పూరీ జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు అయితే, ఈ విషయంపై అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మరోవైపు, రద్దీ ఎక్కువైన ప్రాంతంలోని మిగిలిన వారిని సహాయక సిబ్బమది తక్షణం తరలించారు. సుమారు 120 మందిని ఆసుపత్రిలో చేర్చినట్టు తెలుస్తోంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన నేపథ్యంలో రద్దీ నియంత్రణకు అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్టు సమాచారం. ప్రపంచప్రఖ్యాతి గాంచిన పూరీ జగన్నాథుడి రథయాత్ర లక్షల మంది భక్తుల మధ్య గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే.

## డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదు

- మహిళా బిల్లుతో వారి సాధికారితకు అవకాశం
- బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం



**న్యూఢిల్లీ, జూలై 16 :** డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం చేశారు. ప్రస్తుత సీట్లు తగ్గకుండా 50 శాతం వరకు పెంపునకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. వికసిత భారత్ – 2047 లక్ష్యంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయని లక్ష్మణ్ వెల్లడించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో అభివృద్ధి, సంస్కరణల ఎజెండాపై సభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా ప్రతినిధిగా 25 ఏళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. ఇది అభివృద్ధి పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా నుంచి ఆత్మనిర్భర్ భారత్ వరకు చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో వారి సాధికారతకు ఊతం అవుతుందని బీజేపీ ఎంపీ చెప్పారు. మహిళాబిల్లుతోపాటు డీలిమిటేషన్‌ను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ఒకే దేశం – ఒకే ఎన్నిక దేశ ప్రయోజనాల కోసమేనని తెలిపారు. అవినీతి నిరోధక చట్టాలకు మద్దతు ఇవ్వాలని ప్రతిపక్షాలకు ఆయన సూచించారు. జేపీసీ నివేదిక తర్వాత కీలక బిల్లులపై ముందడుగు పడుతుందని ఎంపీ లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు, మహిళలు, యువత అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలోని పెండింగ్ ప్రాజెక్టులపై పార్లమెంట్‌లో స్వరం వినిపిస్తామని అన్నారు. తెలంగాణకు కేంద్రం భారీగా నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు ఇచ్చిందని ఆయన వివరించారు. వర్షాకాల సమావేశాల్లో సభను అడ్డుకోవద్దని.. చర్చల్లో పాల్గొనాలని ప్రతిపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాలే అందరికీ అత్యున్నత ప్రాధాన్యత కావాలని తెలిపారు. వర్షాకాల సమావేశాలు దేశాభివృద్ధికి కొత్త దిశానిర్దేశర చేస్తాయని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అన్ని అంశాలపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ వివరించారు.

## ఆత్మహత్య చేసుకున్న ఫోక్సో కేసు నిందితుడు

**కామారెడ్డి, జూలై 16 :** కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం చింతామన్‌పల్లి గ్రామంలో యువకుడి ఆత్మహత్య కలకలం రేపింది. రంగబోయిన సందీప్ (23) అనే యువకుడు గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న సందీప్.. ఇటీవలే జైలుకు వెళ్లి బెయిల్‌పై తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి బాలిక తల్లిదండ్రులు తనను తరచూ వేధిస్తూ.. బెదిరింపులకు గురిచేస్తున్నారనే ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తీవ్ర మనస్తాపానికి గురై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. గ్రామ శివారులో సందీప్ మృతదేహం వేలాడుతుండటం గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించారు. బాధిత బాలిక కుటుంబ సభ్యుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని సందీప్ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణం వల్లే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా దోమకొండ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



## వానల కోసం కప్ప పూజలు

**నల్లగొండ,జూలై16 :** వర్షాకాలం ప్రారంభమై దాదాపు నెలరోజులు గడిచినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం ఆధ్వర్యంలో గురువారం మహిళలు సంప్రదాయబద్ధంగా కప్ప కాముడు నిర్వహించి, సకాలంలో వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు బిందెలతో ఆలయానికి చేరుకుని సామూహికంగా జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాటం వెంకటేశం మాట్లాడుతూ, వర్షాభావంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందన్నారు. భగవంతుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ఆనకంటి నరేష్, ఏర్పుల వెంకన్న, కురు యాదయ్య, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ నుంచి కర్నాటకకు రేషన్ బియ్యం

### ఐదుగురు వ్యక్తుల ముఠాను పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్,జూలై16 :** తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ముఠా గుట్ట రట్టు చేశారు గచ్చిబౌలి పోలీసులు. ఈ ముఠాకు చెందిన ఐదుగురు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 220 టన్నుల రేషన్ బియ్యం, 40 బ్యాగుల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ బియ్యం, గోధుమలు తరలిస్తున్న 4 లారీలు, 4 టాటా ఏస్ వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. నిందితులపై కంట్రోల్ యాక్ట్ – 2016 కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. గౌలిదొడ్డి నుంచి కర్ణాటకకు ఈ రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు. నిందితులను విచారిస్తున్నామని పేర్కొన్నారు. వారి నుంచి వివరాలు రాబడుతున్నట్లు చెప్పారు. సివిల్ సప్లయ్స్ విజిలెన్స్ విభాగంలోని అధికారులతోపాటు గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా ఈ దాడి నిర్వహించారు.

## సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో ఇస్లాం బోధన

- రెండో తరగతి విద్యార్థికి మతపైరమన హోం వర్క్
- టీచర్‌ను నిలదీత..పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- ఘటనపై మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, జూలై 16:** హైదరాబాద్‌లోని సైదాబాద్ ప్రాంతంలోని సక్సెస్ స్కూల్‌లో మతపరమైన హోంవర్క్ ఇచ్చారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి 'కల్మా', 'సూరహ్ ఫాతిహా' రాసి, పఠించాలని హోంవర్క్ ఇచ్చినట్లు విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా, ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం స్పందించి, సంబంధిత ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను విధుల నుంచి తొలగించింది. అలాగే భవిష్యత్తులో సక్సెస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల్లో ఆమెకు ఉద్యోగావకాశం కల్పించబోమని తెలిపింది. ఘటనపై విద్యార్థి కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి న్యాయపరమైన అభిప్రాయం తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇదే సమయంలో పాఠశాల వద్ద బీజేపీ నాయకులు నిరసన చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలకు మతపరమైన అంశాలను నేర్చుకోవాలని చెప్పడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయగా, 'మా స్కూల్‌లో చదవాలంటే ఇవి నేర్చుకోవాల్సిందే' అని సదరు టీచర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యం, సంబంధిత టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. కాగా, ఈ వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. హిందూ విద్యార్థికి కల్మా, సూరా ఫాతిహా చదవాలని హోమ్‌వర్క్ ఇవ్వడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. కల్మా చదవాలని విద్యార్థికి హుకుం జారీ చేయడం దుర్మార్గం అన్నారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోకాల్డ్ సెక్యూలర్ సంఘాలు దీనిపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. హిందూ సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## బిఆర్ఎస్ హయాంలోనే ఎయిర్‌పోర్ట్ అనుమతులు

- మంత్రిగా కెటిఆర్ పలుమార్లు ఢిల్లీ వెళ్లి చర్చలు
- స్పష్టం చేసిన వరంగల్ జిల్లా బిఆర్ఎస్ నాయకులు

**వరంగల్,జూలై16 :** మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సంబంధించిన అనుమతులు, భూసేకరణ ప్రక్రియ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, నన్నపునేని నరేందర్ పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. నిజాం కాలంలో నిర్మితమైన మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం మాజీ మంత్రి కేటీఆర్ పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారని తెలిపారు. ఉడాన్ పథకం కింద కూడా కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించామని, 1.8 కిలోమీటర్ల రన్‌వేను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 3.8 కిలోమీటర్లకు విస్తరించేందుకు రైతులను ఒప్పించి భూసేకరణ చేపట్టామని చెప్పారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ, మామునూరు ఎయిర్‌పోర్టు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 253 ఎకరాల భూసేకరణకు కేబినెట్ ఆమోదం లభించిందని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసి పరీక్షలు నిర్వహించామని, ఎన్నికల కోడ్ కారణంగా నియామకాలు నిలిచిపోయాయని అన్నారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం కూడా రూ.500 కోట్లతో భూసేకరణ చేపట్టామని పేర్కొంటూ, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకోవడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ, భూసేకరణకు అనుమతి ఇచ్చింది ఎవరో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. దేశంలో అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ మామునూరు ఎయిర్‌పోర్టును ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు తమ ఘనతగా చెప్పుకోవడం సరికాదన్నారు.



## పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

### ఆరోగ్యం, ఆపరేషన్‌పై గవర్నర్ ఆరా

### త్వరగా కోలుకుని మళ్లీ విధుల్లోకి రావాలని ఆకాంక్ష

**హైదరాబాద్, జులై 16 :** కుడి భుజానికి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు. పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లిన గవర్నర్.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శ అనంతరం గవర్నర్, పవన్ కళ్యాణ్ నివాసంలోని లైబ్రరీని కూడా సందర్శించారు. అక్కడ రచయితలు, పరిశోధకులు, విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రచించిన పలు విలువైన పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలలోని అంశాలు, సమకాలీన సామాజిక, పరిపాలనా, ప్రజా విధానాలపై పవన్ కళ్యాణ్‌తో గవర్నర్ ఆసక్తికరంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ అభ్యర్థన మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఒక పుస్తకంపై తన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. ఈ ఆత్మీయ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. తన ఆరోగ్యాన్ని తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చి పరామర్శించిన గవర్నర్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గవర్నర్ చూపిన ఆప్యాయత, శుభాకాంక్షలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ కొద్దిసేపు పలు సమకాలీన అంశాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.

# దేశంలో డీ లిమిటేషన్ రాజకీయాలు!




**మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్ దృష్టి అంతా ఇప్పుడు డీలిమిటేషన్‌పై ఉంది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈసారి ఎలాగైనా గండం గట్టెక్కేందుకు అవసర మైన వ్యూహాలతో సిద్ధం అవుతోంది. ఆయా రాష్ట్రాల్లోని రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగబోతున్నట్లు తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సమావేశాలు బహుశా నిరూపించనున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు దేశ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ 131వ సవరణ బిల్లు మళ్లీ చర్చకు రావచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదించాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం.**

ఇటీవల మారుతున్న రాజకీయ సమీకరణాలు ఎన్డీఏ ప్రభుత్వానికి ఈ లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలను మరింత పెంచుతున్నాయనే చర్చ సాగుతోంది. గతంలో ఈ బిల్లుకు తగిన మద్దతు లభించక పోవడంతో అది ఆమోదం పొందలేదు. అయితే ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, శివసేనలో జరిగిన మార్పులు, అలాగే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గం నుంచి వస్తున్న సంకేతాలు ఎన్డీఏకు అనుకూలంగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యం గా సుప్రియా సూలే చేసిన వ్యాఖ్యలు ఈ అంశంపై కొత్త చర్చకు దారితీశాయి. డీలిమి టేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను 50 శాతం వరకు పెంచితే తమ పార్టీ సానుకూలంగా ఆలోచించే అవకా శముందని సుప్రియా సూలే వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సం తరించు కుంది. గతంలో ఇదే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సీట్ల పెంపుపై చర్చించేందుకు సిద్ధమని పేర్కొనడం ఇప్పు డు మరోసారి ప్రస్తావనకు వస్తోంది. ఇటీవల ఎన్సీపి అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటి సిఎం ఏక్‌నాథ్ షిండే కలుసుకుని చర్చించారు. బయటకు సాదాసీదా భేటీ అయినా రేపటి పార్లమెంట్ సమా వేశాల్లో మద్దతకు సంబంధించిన వ్యవహారం సాగిందనే అంటున్నారు.

ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఎన్డీఏకు ఇప్పటికే ఉన్న బలానికి అదనంగా తిరుగుబాటు చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, శివసేన నుంచి మారిన సభ్యులు, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో డీఎంకే వైఖరి అత్యంత కీలకంగా మారింది. డీఎంకేకు చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే ప్రభుత్వం లక్ష్యానికి మరింత చేరువ అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన, సీట్ల సంఖ్య పెంపు, అలాగే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన అంశాలు వేగవంతం చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అందుకే ఈ బిల్లుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై ఇంకా పూర్తి స్థాయిలో తమ వైఖరిని వెల్లడించలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశాలపై గతంలో వ్యక్తమైన ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి చర్చ జరుగుతుంది..ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజారిటీని సమీకరించగలదా.. శరద్ పవార్ వర్గం, డీఎంకే వంటి పార్టీల తుది నిర్ణయం ఎలా ఉంటుంది.. అనే అంశాలపై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సమావేశాల్లో జరిగే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఇండియా కూటమిలో ఉన్న డిఎంకె బయటకు వచ్చింది.దీంతో డిఎంకె కూడా కొంత మెత్తబడి ఎన్‌డిఎకు అనుకూలంగా మారనుందన్న సమాచారం. మరోవైపు తమిళనాడులో రాజకీయం మరింత వేడెక్కుతోంది. ఆ రాష్ట్రంలోని ఇండియా కూటమిలో విభేదాలు మరింత బయటపడుతున్నాయి. సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో చేతులు కలిపేందుకు ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎంకే) విముఖత చూపుతోంది.

రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు.. జాతీయ స్థాయిలో మాత్రం కూటమిలో భాగస్వాములుగా కొనసాగవచ్చని విడుతలై చిరుత్తైగల్ కట్చి(వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ సూచించారు. దీనికి కాంగ్రెస్ మద్దతు తెలుపగా.. డీఎంకే మాత్రం ససేమిరా అంటోంది. ఈ సందర్భంగా డీఎంకే ఎంపీ గణపతి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొమ్మిదేళ్లుగా మాతో ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు టీవీకేకు మద్దతిస్తోంది. ఇది వెన్నుపోటుతో సమానం. మంత్రి పదవుల కోసమే కాంగ్రెస్ డీఎంకేను వదిలేసింది. ఇప్పుడు వీసీకేను మధ్యవర్తిగా వాడుకుంటూ మళ్లీ డీఎంకేను ఒప్పించే ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానించారు. కేరళ, బెంగాల్ తరహా రాజకీయాలు తమిళనాడులో పనికిరావని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం.. తమిళనాడులో టీవీకే మూడో ప్రధాన రాజకీయ పార్టీగా అధికారంలోకి వచ్చిందని, దీంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. అంతేకాకుండా.. ప్రస్తుతం పార్లమెంట్‌లో ఒక్క ఎంపీ కూడా లేని టీవీకేను ఇండియా కూటమిలో భాగంగా పరిగణించాలా అనే అంశంపైనా చర్చించాల్సిన అవసరముందని రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ తమను వదులుకోవడం ద్వారా అది ఇండియా కూటమికే నష్టం చేకూరుస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. మొత్తంగా ఇప్పుడు బిజెపి గేమ్‌ప్లాన్ బాగా వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది.

# 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు

## ఎంపిలకు కొత్త మార్గదర్శకాలు జారీ



**న్యూఢిల్లీ, జూలై 16 :** ఈ నెల 20 నుంచి ఆగస్టు 17 వరకు అత్యంత ప్రాధాన్యంతో జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఎంపీల కోసం సరికొత్త మార్గదర్శకాల ను జారీ చేస్తూ అధికారిక బులిటెన్ విడుదల చేసింది. ముఖ్యంగా సభలో ప్రజాప్రతినిధుల వ్యక్తిగత గోప్యతను కాపాడటంతో పాటు పార్లమెంటు అంతర్గత భద్రతను మరింత బలోపేతం చేయడంపై ఈసారి ప్రత్యేక దృష్టి సారించిం ది. అందులో భాగంగా.. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలపై సచివాలయం పూర్తిస్థాయి ఆంక్షలు విధించింది. సభా రికార్డులకు భిన్నంగా రహస్యంగా చిత్రాలు తీయడం, వీడియోలు రికార్డ్ చేయడం వంటి అనధికారిక చర్యలకు ఆస్కారం లేకుండా ఉ ండేందుకే ఈ నిర్ణయం తీసుకున్న ట్లు స్పష్టం చేసింది. డిజిటల్ భద్రతా ప్రమాణాల దృష్ట్యా సభలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నూతన ఆదేశాల ప్రకారం.. సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాల వంటి ఎలాంటి నిఘా ఆధారిత గ్యాజడెట్లనూ అనుమతించరు. కేవలం సాంకేతిక ఆంక్షలకే పరిమితం కాకుండా పార్లమెంట్ ప్రాంగణంలో ప్రజాస్వామ్య యుతమైన గౌరవాన్ని కాపాడేందుకు మరికొన్ని కఠిన నిబంధనలనూ ఈ బులిటెన్‌లో చేర్చారు. పార్ల మెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలు చేపట్టడంపై పూర్తి నిషేధం విధించారు. అలాగే సభా సమయాన్ని, వాతావరణా న్ని దెబ్బతీసేలా ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు తీసుకురావడం వంటి చర్యలను పూర్తిగా నిరాకరిం చారు. వీటితో పాటు పార్లమెంటు పరిధిలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు లేదా పూజలు నిర్వహించకూడదని స్పష్టం చేస్తూ, సభా మర్యాదలను, శాంతిభద్రతలను కాపాడేందుకు ఎంపీలం దరూ సహకరించాలని లోక్‌సభ సచివాలయం ఈ విస్తృతమైన మార్గదర్శకాల ద్వారా కోరింది.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం

- **5 లక్షలకు 111 ప్రశ్నలు విక్రయం**
- **సిబిఐ నివేదికలో వెలుగులోకి కీలక విషయాలు**




**న్యూఢిల్లీ, జూలై 16 :** నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. రసాయన శాస్త్ర ప్రశ్నపత్రాల సెట్లలోని 111 ప్రశ్నలను రూ.5 లక్షలకు విక్రయించినట్లు ఆధారాలు లభించాయని సీబీఐ తెలిపింది. ఈ మేరకు కేసు దర్యాప్తు వివరాలను ప్రత్యేక కోర్టుకు వెల్లడించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన నివేదికలో సీబీఐ పలు కీలక ఆధారాలను ప్రస్తావించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన శివరాజ్.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔ఻ం) ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడైన పీవీ కులకర్ణి నుంచి నీట్ ప్రశ్నలను సేకరించినట్లు దర్యాప్తు సంస్థ తెలిపింది. కులకర్ణి నిర్వహించిన కోచింగ్ తరగతులకు శివరాజ్ కుమారుడు హాజరయ్యాడని పేర్కొంది. కేసు దర్యాప్తులో భాగంగా శివరాజ్ ఫోన్‌ను పరిశీలించగా.. అందులో 36 ఫొటోలు లభించినట్లు సీబీఐ తెలిపింది. వాటిలో చేతితో రాసిన 132 రసాయన శాస్త్ర ప్రశ్నలు ఉండగా.. అందులో 111 ప్రశ్నలు నీట్ యూజీ 2026 మాస్టర్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలినట్లు వెల్లడించింది. రసాయన శాస్త్ర ప్రశ్నలకు సంబంధించిన చేతిరాత నోట్స్ నిందితుడు రాసినవేనని తాము భావిస్తున్నట్లు కోర్టుకు సీబీఐ తెలిపింది. మే 3న జరిగిన నీట్ పరీక్షకు దాదాపు 10 రోజుల ముందు ఈ ఫొటోలు తీసినట్లుగా దర్యాప్తు సంస్థ గుర్తించింది. ఈ కేసులో ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేయగా.. వారంద రూ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు సీబీఐ తెలిపింది. పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో నీట్- ప్రశ్నపత్రం లీక్ కేసులో సీబీఐ ఢిల్లీ కోర్టుకు కీలక వివరాలు వెల్లడించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ మోటెగావ్‌కర్ మొబైల్ ఫోన్‌లో 136 చేతిరాత ప్రశ్నల్లో 111 ప్రశ్నలు ఎన్‌టీఏ రూపొందించిన క్వశ్చన్ పేపర్ సెట్‌తో సరిపోలినట్లు సీబీఐ కోర్టుకు తెలిపింది. లాతూర్‌లో రేణుకై కెమిస్ట్రీ క్లాసెస్ నిర్వహిస్తున్న శివరాజ్ మోటెగావ్‌కర్, 'మోటెగావ్‌కర్ సర్‌స్ ఆర్‌సీసీ' పేరుతో సుమారు 1.68 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్న యూట్యూబ్ ఛానెల్‌ను కూడా నిర్వ హిస్తున్నాడు. అతను ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను సీబీఐ పరిశీలించగా, అందులో కెమిస్ట్రీకి సంబంధించిన 132 చేతిరాత ప్రశ్నలు ఉన్న 36 ఫొటోలు లభించాయి. వాటిలో ఐదు ఫొటోలు ఒకే విధంగా ఉండగా, మిగిలిన ఫొటోల్లో ఉన్న చేతిరాత ప్రశ్నలు శివరాజ్ మోటెగావ్‌కర్ రాసినవేనని సీబీఐ భావిస్తోంది. సీబీఐ దర్యాప్తు ప్రకారం.. మే 3న జరిగిన నీట్-యూజీ 2026 పరీక్షకు దాదాపు 10 రోజుల ముందే, అంటే ఏప్రిల్ 23న శివరాజ్ మోటెగావ్‌కర్‌కు లీకైన ప్రశ్నలు అందినట్లు తెలుస్తోంది. లాతూర్‌కు చెందిన డాక్టర్ మనోజ్ శిరూరే, మాజీ ఎన్‌టీఏ ప్యానెల్ సభ్యుడు, రిటైర్డ్ కెమిస్ట్రీ లెక్చరర్ పీవీ కులకర్ణి ద్వారా ఈ ప్రశ్నలు మోటెగావ్‌కర్‌కు చేరిన ట్లు సీబీఐ తెలిపింది. ఇందుకోసం రూ.5 లక్షలు చెల్లించినట్లు కూడా ఆరోపించింది. ఈ కేసులో ఇప్పటికే మోటెగావ్‌కర్‌ను అరెస్టు చేసిన సీబీఐ, అతని బెయిల్‌ను వ్యతిరేకిస్తూ ఢిల్లీ కోర్టుకు సమర్పించిన నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. అలాగే, లీకైన ప్రశ్నపత్రం పీడీఎఫ్ కాపీలను టెలిగ్రామ్ ద్వారా రూ.10 లక్షలకు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పరీక్షకు కొన్ని వారాల ముందే 410 ప్రశ్నలతో కూడిన 150 పేజీల 'అంచనా ప్రశ్నపత్రం'ను కొంతమంది అభ్యర్థులకు అందించినట్లు సీబీఐ తెలిపింది. అందులోని సుమారు 120 ప్రశ్నలు నీట్-యూజీ 2026 కెమిస్ట్రీ ప్రశ్నపత్రంలో వచ్చిన ప్రశ్నలతో సరిపోలినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో పరీక్షకు ముందే ప్రశ్నపత్రంలోని కీలక ప్రశ్నలు కొందరి చేతికి చేరినట్లు సీబీఐ దర్యాప్తులో గుర్తించింది.

# పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

## నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, జూలై 16 :** దేశంలో తొట్టతొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనున్నది. హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభం కానున్నది. ప్రధాని మోదీ నేడు ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. హైడ్రోజన్ రైలు భారతీయ రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నది. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడవనున్నది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్- సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపేట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆనోడ్‌పై హైడ్రోజన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణాలు.. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవుతాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటాన్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రాయి, గోహనా, రత్రా, లాత్, మోహనా హర్యానా, భర్వాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉ త్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.



# 9వ తరగతిలో మూడో భాషపై సుప్రీం అభ్యంతరం

**న్యూఢిల్లీ, జూలై 16 :** 9వ తరగతి విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షలకు పునాది వేసే ఈ దశలో కొత్త భాషను ప్రవేశపెట్టడం విద్యార్థులపై అదనపు ఒత్తిడిని పెంచుతుందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో 9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టవద్దని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈ అమలు చేస్తున్న మూడు భాషల విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కొత్త భాషను నేర్చుకోవడం మంచిదేనని, అయితే బోర్డు పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో విద్యార్థులపై అదనపు భారం వేయడం సమంజసం కాదని అభిప్రాయపడింది. కొత్త భాషను చిన్న తరగతుల నుంచే బోధిస్తే విద్యార్థులకు అలవాటు కావడానికి సమయం దొరుకుతుందని పేర్కొంది. ఇటీవల సీబీఎస్ఈ 9వ తరగతి నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు, పాఠశాలలు, విద్యార్థుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమలుకు తగిన సమయం ఇవ్వలేదని, తగిన పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేవని, అలాగే ఇతర సౌకర్యాలు కూడా పూర్తి స్థాయిలో లేవని విమర్శలు వచ్చాయి. కాగా, సుప్రీంకోర్టు ప్రస్తుతం ఈ విధానాన్ని పూర్తిగా నిలిపివేయలేదు. అయితే 9వ తరగతిలో మూడో భాషను తప్పనిసరి చేయడంపై కేంద్రం మరోసారి ఆలోచించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణలో కేంద్రం, సీబీఎస్ఈ తమ వైఖరిని వివరించనున్నాయి.



# సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఆందోళన

## అతడిని కాపాడాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, జూలై 16 :** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అతడి ఆరోగ్యాన్ని కాపాడాలని ఆదేశించింది. రెండు వారాలకుపైగా దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో దిల్లీ హైకోర్టు జోక్యం చేసుకుంది. ఆయన ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వ వైద్యుడి పర్యవేక్షణలో ఎటువంటి వైద్య చికిత్సలైనా అం దించాలని గురువారం కేంద్రాన్ని ఆదేశించింది. ప్రతిపౌరుడి ప్రాణం అమూల్యమైంది. అలాంటి ప్రాణాలు కాపాడటానికి ప్రభుత్వాలు అన్ని ప్రయత్నాలు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. మరో 48 గంటలు ఈ నిరాహారదీక్ష ఇలాగే కొనసాగితే 59 ఏళ్ల వాంగ్‌చుక్ ప్రాణాలకు ప్రమాదం వాటిల్లొచ్చంటూ బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. వాంగ్‌చుక్ గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేసిన పిటిషనర్.. ఆయనకు బలవంతంగా ఆహారం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరా రు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. తాజా ఆదేశాలు జారీ చేసింది. 19 రోజులుగా వాంగ్‌చుక్ దీక్ష చేస్తున్నారు. ఇన్ని రోజులుగా ఆహారం తీసుకోకపోవడం తో ఆయన 9 కేజీల వరకు బరువు తగ్గారని వైద్యనిపుణులు చెప్తున్నారు.



## ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పోరాట కమిటీ వినతి

**హైదరాబాద్,జూలై 16(జనంవార్త) :** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట కమిటీ ప్రతినిధుల బృందం గురువారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) అమలు 2004 ముందే నియామక నోటిఫికేషన్లు వెలువడి, అనంతరం ఉద్యోగాల్లో చేరి ప్రస్తుతం సీపీఎస్ పరిధిలో కొనసాగుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని కోరుతూ "2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట కమిటీ తెలంగాణ రాష్ట్రం" ప్రతినిధుల బృందం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కు వినతి పత్రం అందజేశారు. ఈ బృందంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాడవేడి వినోద్ కుమార్,ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సంతోష్ కుమార్, కోశాధికారి గుంటి వేణుగోపాల్,రాష్ట్ర ముఖ్య సలహాదారు రేండ్ల రాజేశ్,తెలంగాణ గ్రూప్-1 అసోసియేషన్ అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, తెలంగాణ సచివాలయం అధికారులు స్వామి గౌడ్, జె. వినోద్,తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెలాఖర్ లోగా ఈ - కేవైసీ పూర్తి చేయాలి

**మేడ్చల్ :** మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో రేషన్ కార్డు లబ్దిదారులు ఈ నెలాఖర్ లోగా ఈ - కేవైసీ నమోదును పూర్తి చేయాలని జిల్లా సివిల్ సప్లయ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం డి.ఎస్.ఓ జిల్లాలోని డీలర్స్ తో కలెక్టరేట్ లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీ.ఎస్.ఓ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 22,52,492 మంది రేషన్ కార్డుదారులుండగా అందులో ఇప్పటి వరకు 16,49,021 మంది సభ్యులు మాత్రమే ఈ - కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకున్నారని, ఇంకా 6,03,471 మంది సభ్యులు ఈ - కే.వై.సీ పూర్తి చేయవలసి ఉందని అన్నారు. ఈ విషయమై గతంలో కూడా పలు మార్లు చెప్పినప్పటికీ, ఇంకా కొంత మంది నమోదు చేసుకోలేదన్నారు. అందువల్ల మిగిలిన 6,03,471 మంది రేషన్ కార్డు లబ్దిదారులు తమకు అందుబాటులో ఉన్న రేషన్ షాప్ ను సందర్శించి, ఎటువంటి జాప్యం లేకుండా ఈ నెల 31 లోగా ఈ - కే.వై.సీని పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే, జిల్లాలోని అన్ని రేషన్ షాప్ డీలర్లు (ఈ నెల బియ్యం పంపిణీ పూర్తయినప్పటికీ), ఈ నెలాఖరు వరకు రేషన్ దుకాణాలను తెరిచి ఉంచి ఈ - కే,వై,సీ పూర్తి చేసుకోవడానికి సహకరించాలన్నారు.

## సొంతగూటికి సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్

- ఇండిపెండెంట్‌గా గెలిచి సత్తా చాటిన నేతకు కాంగ్రెస్ పెద్దపీట
- అధికారికంగా సస్పెన్షన్ ఎత్తివేత.. దేవరుప్పుల కాంగ్రెస్‌లో నూతనోత్తేజం
- గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో ఘన చేరిక
- దగ్గరుండి ఆహ్వానించిన పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



**దేవరుప్పుల :** పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ప్రజాబలం, గుర్తింపు ఉన్న గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ తిరిగి సొంతగూటికి చేరారు. రెండేళ్ల క్రితం ఎదురైన రాజకీయ ప్రతికూలతలను ఎదురొడ్డి నిలిచిన ఆయనపై కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం సస్పెన్షన్‌ను అధికారికంగా ఎత్తివేసింది. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో కృష్ణమూర్తి గౌడ్ తన అనుచరులతో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా ఆయనకు పార్టీ మూడు రంగుల కండువా కప్పి పార్టీలోకి సాదరంగా పునఃస్వాగతం పలికారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన పెద్ది కృష్ణమూర్తి గౌడ్‌ను రెండు సంవత్సరాల క్రితం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి.. దేవరుప్పుల మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తప్పించడమే కాకుండా, పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆ విపత్కర పరిస్థితుల్లోనూ కృష్ణమూర్తి గౌడ్ ఏమాత్రం బెదరలేదు. సిద్ధాంతాలను పక్కనపెట్టి ఇతర పార్టీల వైపు చూడలేదు. తనను నమ్ముకున్న ప్రజలు, కార్యకర్తల మద్దతుతో స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగారు. తన రాజకీయ సత్తా చాటుతూ సర్పంచ్‌గా ఘన విజయం సాధించి ప్రజాక్షేత్రంలో తన బలాన్ని నిరూపించుకున్నారు. ఆయన పట్టుదల, ప్రజాబలాన్ని గుర్తించిన కాంగ్రెస్ అధిష్ఠానం.. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చొరవతో తిరిగి పార్టీలోకి సగౌరవంగా ఆహ్వానించింది. ఈ చేరికల సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక మహా సముద్రం లాంటిదని, ఇక్కడ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని స్పష్టం చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబం వలె పనిచేస్తోందని స్పష్టం చేశారు. తిరిగి కాంగ్రెస్ గూటికి చేరడం పట్ల సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సర్పంచ్ కృష్ణమూర్తి గౌడ్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి పార్టీలోకి తీసుకోవడంతో దేవరుప్పుల మండల, గ్రామ కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం వెల్లివిరిసింది.

## రాంజోజిగూడెం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీను ఏకగ్రీవ ఎన్నిక



**దేవరుప్పుల :** పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి , టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. దేవరుప్పుల మండలంలోని రాంజోజిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించగా, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనుకు దావెర అనిల్ కుమార్ అభినందనలు తెలియజేస్తూ, గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాదబోయిన గణేష్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్యా సజ్జన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ భాస్కర్, రామచంద్రు, రాంజోజిగూడెం సర్పంచ్ ధనలక్ష్మి-భాస్కర్, పెండ్లి సోమిరెడ్డి, ఉపసర్పంచ్ కొండయ్య, మేడ బాబు, ఇనుముల బిక్షపతి, రమణాచారి, బానోత్ శ్రీను, నల్లకుంట తండా సర్పంచ్ మహేందర్, రెడ్డిరాజుల రమేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు గనుపాక ప్రదీప్, అఖిల్, ఎల్లప్ప, ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఉమేష్, బానోత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




## మియాపూర్‌లో దోపిడీ కేసు నిందితుడి అరెస్టు

**శేరిలింగంపల్లి, జూలై 16(జనం వార్త):** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు ప్రధాన నిందితుడు బసోడి అభిషేక్‌ను అరెస్టు చేశారు. ఈ మేరకు కూకట్‌పల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి జెప్టో డెలివరీ బాయ్ గోపాల్‌రావు నగర్ రోడ్ నెం.18 ప్రాంతంలో డెలివరీకి వెళ్తుండగా, స్కూటర్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతడిని అడ్డగించి దాడి చేశారు. అనంతరం చంపేస్తామని బెదిరించి అతని మొబైల్ ఫోన్‌ను అన్‌లాక్ చేయించి, బ్యాంకు ఖాతా నుంచి రూ.900 తమ ఖాతాకు బదిలీ చేయించడంతో పాటు జేబులో ఉన్న రూ.5,000 నగదును దోచుకుని పరారయ్యారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులు ప్రత్యేక బృందాల సహాయంతో నిందితుడు బసోడి అభిషేక్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.400 నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది. పోలీసుల వివరాల ప్రకారం, బసోడి అభిషేక్‌పై గతంలో మధురానగర్, మియాపూర్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లలో దోపిడీ, ఇతర నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సహచరులతో కలిసి రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. రాత్రి వేళల్లో నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా అత్యవసర పోలీస్ సహాయ నంబర్ 100కు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# సరైన పద్ధతిలో వాడితే.. అద్భుత ఫలితాలు..

విద్యార్థుల్లో సోషల్ మీడియా వినియోగం బాగా పెరిగింది. చాలా మంది ఇందులోనే పూర్తిగా లీనమైపోయి, సమయాన్ని వృథ చేసుకుంటున్నారు. కొంత మంది వ్యసనాలకు బానిసలవుతుండగా, మరి కొందరు సైబర్ మోసాలకూ బలవుతున్నారు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు ఎంతో ఆవేదన చెందుతున్నారు. కొన్ని సర్వేల ప్రకారం 69 శాతం టీనేజర్లు తమ భావాలను తెలియజేయడానికి సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్నారు. ఈ అలవాటును చదువు పరంగా మెరుగవ్వడానికి ఉపయోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.




### సానుకూల ప్రభావం:

ప్రస్తుత విద్యా వ్యవస్థలో స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. విద్యార్థులకు సమాచారాన్ని అందుబాటులో ఉంచుతూ, యూట్యూబ్ మొదలైన వేదికల ద్వారా వీడియో పాఠాలు విని, అర్థం చేసుకోవడం ఎంతో సులువైంది. వీటి ద్వారా వేగంగా సమాచారం తెలుసుకుని నేర్చుకుంటున్నారు. మారుమూల గ్రామాల్లో ఉంటూ, ఆన్‌లైన్‌లో క్లాసులు విని ఉద్యోగాలు పొందినవారూ ఉన్నారు.

### నైపుణ్యాలకు మెరుగులు :

మనకు ఇష్టమైన పనే చేస్తూ, సామాజిక మాధ్యమాల్లో మంచి పేరు తెచ్చుకోవచ్చు. అజయ్‌కి డ్రాయింగ్ అంటే ఇష్టం. వేసవి సెలవుల్లో స్మార్ట్ ఫోన్ వచ్చాక దానిపై దృష్టి తగ్గింది. అయితే వాళ్ల అమ్మ ఫోన్ వాడకుండా ఆంక్షలు పెట్టినప్పటికీ, దారి మళ్లించ లేకపోయింది. బాగా ఆలోచించి, ఫోన్‌లో నీ డ్రాయింగ్స్ అప్‌లోడ్ చేయి అని సూచించింది. అలా మొదలైన అజయ్ డ్రాయింగ్ పోస్టులకు విశేష ఆదరణ లభించింది. వాటి ద్వారా ఆదాయం పొందుతూ, చదువూ కొనసాగిస్తున్నాడు. దీని వల్ల అతడిలో ఆత్మవిశ్వాసం పెరిగి, నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడంపై దృష్టి సారించాడు.

అనవసరమైన వాటికి ఉపయోగించకుండా.. నైపుణ్యాలు ప్రదర్శించడం, అభిరుచులను వ్యక్తపరచడం, ఆన్‌లైన్ ద్వారా నేర్చుకోవడం, నెట్‌వర్క్ పెంచుకోవడం ఇలాంటి వాటికి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవచ్చు.


### ఉద్యోగావకాశాల్లోనూ:

కొన్ని సంస్థలు ఉద్యోగుల ఎంపికలో అభ్యర్థుల సోషల్ మీడియా ఖాతాల వివరాలూ అడుగుతున్నాయి. వాటి ద్వారా వాళ్ల నెట్‌వర్క్, ట్రోల్స్, పోస్టులు వారి సొంత బ్రాండ్ ఇలాంటివన్నీ తనిఖీ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో ఉన్న తీరును బట్టి వారు ఉద్యోగాలకు అర్హులా, కాదా అని నిర్ణయిస్తున్నాయి. మంచి పేరు ఉంటే సంస్థకూ ప్రయోజనమే అని, అలాంటి వారినే ఎంచుకుంటున్నాయి.

### డిజిటల్ అక్షరాస్యత:

బ్రాండ్ మార్కెటింగ్, సోషల్ మీడియా ఎస్ఈవోల గురించి పూర్తిగా తెలుసుకుంటే భవిష్యత్తుల్లో అనేక అవకాశాలను అందుకోవచ్చు. సోషల్ మీడియా సంస్థలు, వేదికల్లో సేవలూ అందించవచ్చు. మంచి కంటెంట్ అందించినవారు ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారి సంపాదిస్తూ, సంతృప్తినీ పొందవచ్చు.

సోషల్ మీడియాను ఎందుకోసం, ఎలా ఉపయోగిస్తున్నామో కీలకం. దాన్ని ఉపయోగకరంగా మార్చుకుంటే అస్త్రంగా మారుతుంది. అలా కాకుండా వినోద సాధనంగా వాడితే బద్ధకస్తులు, వ్యసనపరులుగా మార్చేస్తుంది. అంతేకాకుండా సైబర్ మోసాలకూ గురికావొచ్చు. మానసికంగానూ ఎంతో ఒత్తిడినీ ఎదుర్కోవాల్సి వస్తుంది. చదువులోనూ వెనకబడిపోతారు. ఆరోగ్య సమస్యలూ మొదలవుతాయి. కాబట్టి సోషల్ మీడియాను ఉపయోగకరంగా వాడుకోవాలి. అవసరం లేని కంటెంట్ రాకుండా ఫోన్‌ను నియంత్రించు కోవాలి. అటువంటి వాటి జోలికి వెళ్లకుండా మనసును అధీనంలో పెట్టుకోవడం ఎంతో ముఖ్యం.





# ఇంద్రకీలాద్రిపై ఆషాడ శోభ

## దుర్గమ్మకు సారె సమర్పించిన కలెక్టర్ దంపతులు

**విజయవాడ, జూలై 16 :** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలోని శ్రీ కనకదుర్గమ్మ వారిని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆషాఢ సారె సమర్పణ ఉత్సవాల సందర్భంగా కలెక్టర్ దంపతులు ఇంద్రకీలాద్రికి విచ్చేసి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ కలెక్టర్ దంపతులకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిని అమ్మవారి దర్శనానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆషాడ సార సమర్పించిన కలెక్టర్ దంపతులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ర్శనం అనంతరం వేద పండితులు కలెక్టర్ దంపతులకు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు ప్రసాదాలు సమర్పించారు. ఆషాఢ మాస ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిలో భక్తుల సందడి కొనసాగుతుండగా, దేవస్థానం అధికారులు భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

# ఆక్వా రంగం బలపడడం జగన్‌కు ఇష్టం లేదు

- గతంలో ఆర్థికంగా రాష్ట్రాన్ని దెబ్బతీసిన ఘనత
- జగన్ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి యనమల

**అమరావతి, జూలై 16 :** జగన్ ఆక్వా రంగాన్ని పూర్తిగా నాశనం చేయాలని కోరుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మండిపడ్డారు. తద్వారా ఆ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ప్రజలకు ఉపాధి అవకాశాలు లేకుండా చేయాలన్నదే ఆయన ప్రధాన ఉద్దేశమని ఆరోపించారు. ఈ మేరకు ఆక్వా రంగంపై వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. అంతర్జాతీయ మార్కెట్లు ఎప్పటికప్పుడు మారుతూ దేశీయ మార్కెట్‌పై చూపే గణనీయ-ఎమైన ప్రభావాన్ని అర్థం చేసుకోవడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారని యనమల ఎద్దేవా చేశారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు సమగ్ర ఆర్థిక అభివృద్ధిని దెబ్బతీసి.. ఆంధ్రప్రదేశ్‌ను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన ఘనత జగన్‌దేనని యనమల దుయ్యబట్టారు. నాడు అధికారంలో ఉన్న సమయంలో ఆక్వా రంగానికి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు, రాయితీలను తొలగించడం ద్వారా ఈ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లు వృద్ధి చెందుతున్నప్పటికీ రాష్ట్రంలో ఆక్వా రంగం ఎందుకు భారీగా క్షీణించిందో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా జగన్ రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి అడ్డంకిగా మారకుండా, బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడిగా వ్యవహరించాలని యనమల హితవు పలికారు.

# ముద్రగడ కూతురును అడ్డుకోవడం ఏమిటి?

## వైకాపా నేతల తీరుపై మండిపడ్డ బుచ్చయ్య

**రాజమహేంద్రవరం, జూలై 16 :** ముద్రగడను కడసారి చూసేందుకు వెళ్లిన ఆయన కుమార్తెను వైకాపా నేతలు అడ్డుకోవడం ఏంటని తెదేపా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రశ్నించారు. పరామర్శకు వైకాపా అధ్యక్షుడు జగన్ ర్యాలీగా వెళ్లడమేంటని ఆక్షేపించారు. ముద్రగడపై ప్రేమతో వెళ్లారా? రాజకీయ ప్రయోజనం కోసం వెళ్లారా? అని నిలదీశారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బుచ్చయ్యచౌదరి మాట్లాడారు. మత్స్యకారులు, ఆక్వా రైతులకు వైకాపా హయాంలో జగన్ ఏం చేశారో చెప్పాలని బుచ్చయ్యచౌదరి నిలదీశారు. బైక్‌తో ఢీకొట్టి ఒకరి మృతికి కారణమైన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడిని జగన్ వెనకేసుకుని రావడమేంటని ప్రశ్నించారు. ముద్రగడ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తుంటే మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైకాపా నేతలు అడ్డుకోవడంపై బుచ్చయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు బుద్ధి చెప్పినా వైకాపా నేతలకు బుద్ధి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి విలువైన ప్రాజెక్టులు తరలి వస్తున్నాయని గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రెండు స్టీల్‌లాంట్‌లతో పాటు ఆటో మె-ఎబైల్, సెల్‌ఫోన్ కంపెనీలు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాలతో ముందు కెళ్తోందన్నారు. మంత్రి లోకేశ్ కృషితో విదేశాల నుంచి పరిశ్రమలు వస్తున్నాయని వివరించారు. ఈనెల 22న రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ కాంపౌండ్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. 1600 పోస్టుల భర్తీకి వివిధ కంపెనీలు వస్తున్నాయని చెప్పారు. నిరుద్యోగులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

# ఆక్వా రైతుల సబ్సిడీకి తిలోదకాలు ఇచ్చిన జగన్ నీతులు చెప్పడం విడ్డూరం

## ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి, జులై 16 :** ఆక్వా రైతుల విద్యుత్ సబ్సిడీ విధానాన్ని నిర్వీర్యం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు ఆక్వా రైతుల గురించి మాట్లాడటం ఆశ్చర్యకరమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఈ మేరకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఓ నోట్ ను విడుదల చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలోనే ఆక్వా ప్రాంతాన్ని ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌లుగా విభజించి వేలాది మంది రైతులను విద్యుత్ సబ్సిడీకి దూరం చేశారని మంత్రి పేర్కొన్నారు. జగన్ రెడ్డి తీసుకొచ్చిన ఈ విధానంతోనే ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విధానాన్ని సరిదిద్దుతూ అర్హులైన ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి ప్రతి అర్హులైన రైతన్నలకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం వ్యవసాయ రైతులతో పాటు ఆక్వా రైతులు, చేనేత కార్మికులు, స్వర్ణకారులు, నాయి బ్రాహ్మణులకు కూడా విద్యుత్ సబ్సిడీలు అందిస్తోందని మంత్రి గొట్టిపాటి వివరించారు. వివిధ వర్గాల జీవనోపాధికి అండగా నిలిచేలా విద్యుత్ రాయితీలను కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో విద్యుత్ రంగంతో పాటు ఆక్వా రంగం, ఇతర కీలక వ్యవస్థలను వైఎస్సార్సీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని మంత్రి ఆరోపించారు.

# భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం

- పీపీపీ ప్రాజెక్టులతోనే వేగంగా అభివృద్ధి
- నిరర్థకంగా ఉన్న ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం
- మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానంపై కేంద్రం ప్రశంసలు
- పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0 మార్గదర్శకాలు త్వరలో విడుదల
- పీపీపీ ప్రాజెక్టులు, పీపీపీ విధానంపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి, జూలై 16 :** భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గతంలో ఆర్థిక సంస్కరణలు, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం దేశంలో నడుస్తోందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతోనే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు చేపట్టి వేగంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో పీపీపీ కింద చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్ యార్డులు, ఎయిర్ పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు సహా మె-ఎత్తం 260 ప్రాజెక్టులను పీపీపీ కింద చేపట్టినట్టు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్ లాంటి రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం అన్ని పీపీపీ ప్రాజెక్టులనూ సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని... ప్రతీ ప్రాజెక్టు వద్దా ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్థంగా వినియోగించుకోవాలని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమర్థంగా నడిపేందుకు అవసరమైన మెకానిజమ్ సిద్ధం చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను కూడా భాగస్వాములను చేసి వారికి ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలన్నారు. విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు రూ.178 కోట్ల వీజీఎఫ్‌ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని.. ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు. వచ్చే కేబినెట్‌కు నూతన విధానంఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం-వీజీఎఫ్ పాలసీ 1.0 ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ ఏటా పీపీపీ కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేపట్టాల్సి రావొచ్చని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోటుపాట్లను సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని... సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ ను తయారు చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడిదారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సీఎం సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజి రావాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగంప్రభుత్వం వద్ద నిరర్థకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలచుకోవాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోనూ చదివేలా వీరిని తీర్చి దిద్దాలని అన్నారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పీయూష్ కుమార్, వి.వినయ్ చంద్, రోనాల్డ్ రోస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఐఅండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తదితరులు హాజరయ్యారు.

# బలప్రదర్శనగా జగన్ పరామర్శలు

- విశాఖ మత్స్యకారుల పరామర్శలోనూ అదే తంతు
- జగన్ తీరుపై మండిపడ్డ హోంమత్రి అనిత




**విజయనగరం, జూలై 16 :** బాధితులను పరామర్శించడానికి వచ్చిన ప్రతిసారి జగన్ రెడ్డి బలప్రదర్శన చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత దుయ్యబట్టారు. విశాఖపట్నం మత్స్యకారుల విషయాన్ని జగన్ అండ్ కో రాజకీయం చేయడానికి ప్రయత్నించి విఫలమైందని అనిత విమర్శించారు. వైసీపీ హయాంలో ఒక్క మత్స్యకారుడిని కూడా పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస ఘటనలో తప్పు ఎవరూ చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనను కూడా తాము సీరియస్‌గా తీసుకున్నామని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ నీచపు రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. గురువారం విజయనగరంలో హోం మంత్రి అనిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. బోటు గల్లంతైన వెంటనే ప్రభు త్వం స్పందించి నేవీ అధికారులకు సమాచారం అందజేసిం దని తెలిపారు. వెంటనే 72 గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు. జగన్ హయాంలో పోలీసులను వాడుకున్నారే తప్పా వారి సంక్షేమాన్ని ఎందుకు పట్టించుకోలే దని అనిత ప్రశ్నించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు పెండింగ్‌లోని పరిహారం చెల్లిస్తామని మాటిచ్చారు. జిందాల్ పరిశ్రమకు సంబంధించి రైతులకు కూడా పరిహార చెక్కులను వెంటనే చెల్లిస్తామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# మమతా బెనర్జీకి వరుస షాక్‌లు

## టిఎంసికి, రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ రాజీనామా

## ఛైర్మన్ రాధకృష్ణకు రాజీనామా అందచేత



**కోల్‌కతా, జూలై 16:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులూతనే ఉన్నాయి. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ రుక్మిణి మల్లిక్ (కోయెల్ మల్లిక్) షాక్ ఇచ్చారు. టీఎంసీకి, రాజ్యసభ సభ్యత్వానికి రుక్మిణి మల్లిక్ గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆమె సమర్పించారు. దీంతో రాజ్యసభ నుంచి వైదొలిగిన నాలుగో టీఎంసీ ఎంపీగా రుక్మిణి నిలిచారు. ఇప్పటికే ఆ పార్టీ నుంచి సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరైక్, సుష్మితా దేబ్ తమతమ రాజ్యసభ ఎంపీ పదవులకు రాజీనామా చేశారు. ఈ ఏడాది ఆరంభంలోనే రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ ఎన్నికయ్యారు. టీఎంసీ 2026 ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలకు ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికై ఏప్రిల్ 6న రాజ్యసభ ఎంపీగా రుక్మిణి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన వెంటనే టీఎంసీ, మమతా బెనర్జీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది ఓ కొత్త ప్రయాణానికి ఆరంభమని, ఉత్తమంగా పని చేసేందుకు ప్రయత్నిస్తానని రుక్మిణి చెప్పుకొచ్చారు. అయితే ఎంపీగా ఎన్నికై నాలుగు నెలలు గడవక ముందే తన పదవికి ఆమె రాజీనామా చేయడం సంచలనంగా మారింది. కాగా, రుక్మిణి మల్లిక్ రాజీనామాపై టీఎంసీ, మమతా బెనర్జీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. రుక్మిణి మల్లిక్.. కోయెల్ మల్లిక్ పేరుతో బెంగాలీ చిత్ర పరిశ్రమలో అగ్రశేణి నటి. టాలీ-క్వీన్‌గా ప్రసిద్ధి చెందిన రుక్మిణి రెండు దశాబ్దాలకు పైగా నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. 'నాటర్ గురు', 'శుభోదృష్టి', 'మోన్ మానే నా', 'ప్రేమేర్ కహానీ', '100? లవ్', 'రంగబాజ్' వంటి వరుస హిట్ చిత్రాల్లో ఆమె నటించి మెప్పించారు. రుక్మిణి నటనకు గానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ బంగ్లా, రెండు బీఎఫ్‌జేఏ అవార్డులు, ఆనందలోక్ పురస్కార్ వంటి అనేక గౌరవాలను అందుకున్నారు. 2023లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆమెకు మహానాయక్ సమ్మాన్‌ను కూడా ప్రదానం చేసింది. అనంతరం టీఎంసీ పార్టీ ఆమెను రాజ్యసభకు నామినేట్ చేసింది.

# గొల్లప్రోలు, మూలపేట ఘటనలపై పవన్ సీరియస్

## సమగ్ర దర్యాప్తు జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోండి

## కాకినాడ జిల్లా పోలీసులకు డిప్యూటీ సిఎం పవన్ ఆదేశం



**అమరావతి, జూలై 16 :** కాకినాడ జిల్లాలోని గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలం మూలపేట ప్రాంతాల్లో జరిగిన ఘటనలపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మద్యం మత్తులో, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా, సంబంధిత వ్యక్తుల భవిష్యత్తును కూడా అంధకారంలోకి నెడతాయని పేర్కొన్నారు. గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలం మూలపేట ప్రాంతాల్లో చోటుచేసుకున్న సంఘటనలే ఇందుకు నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఈ రెండు ఘటనలపై కాకినాడ జిల్లా పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సున్నితమైన ప్రాంతాలు గుర్తించి అవగాహన సదస్సులు నిర్వహించాలని పవన్ కల్యాణ్ సూచించారు. కాగా, కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఓ వ్యక్తితో కొంతమంది యువకులకు గొడవ జరిగింది. ఈ ఘటనలో పెదపూడి మండలం రామేశ్వరానికి చెందిన రాకేశ్ (25) అనే యువకుడు మృతిచెందాడు. తన అమ్మమ్మ వేమగిరి రమణమ్మ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బుధవారం మూలపేటకు రాకేశ్ వచ్చాడు. ఈ సందర్భంగా రాకేశ్ చెల్లి గ్రామంలోని ఓ దుకాణం వద్దకు వెళ్లగా, స్థానికంగా ఉన్న ఐదుగురు యువకులు ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధించారు. ఈ క్రమంలో తన అన్న రాకేశ్.. ఐదుగురు యువకులను మందలించాడు. వీరిలో వంశీ అనే యువకుడు కోపంతో రాకేశ్‌ను చాకుతో పొడవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గొల్లప్రోలు నగర పంచాయతీ రెండో వార్డు మాజీ కౌన్సిలర్ సంధ్య భర్త లింగం అర్జునుడు, తన స్నేహితులతో కలిసి దారపల్లి వాటర్ ఫాల్స్‌కు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన స్థానికుడు బచ్చల మారుతి పవన్ కల్యాణ్ అనే వ్యక్తితో అర్జునుడికి ఓ విషయంలో గొడవ జరిగింది. ఈక్రమంలో మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే అర్జునుడి కడుపులో బచ్చల మారుతి పవన్ కల్యాణ్ బలంగా పొడిచాడు. కత్తిపోట్లకు గురైన అర్జునుడిని పిఠాపురంలోని కార్తికేయ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అర్జునుడు ఆస్పత్రిలోనే మృతిచెందాడు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు జరపాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు.



## పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన

# బిజెపి ప్రజాప్రతినిధుల బృందం

**ఏలూరు, జూలై, 16 :** పోలవరం ప్రాజెక్టు పనుల తీరును గురువారం బిజేపీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. తొలుత పోలవరం ప్రాజెక్టు సైటుకు చేరుకున్న కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమలు శాఖా సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర బిజేపి అధ్యక్షులు పి.వి.యన్. మాధవ్, రాజమండ్రి పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి, శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అదోని ఎమ్మెల్యే డా.పి.వి. పార్థసారథి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే యన్.ఈశ్వర రావు, విశాఖపట్నం ఎమ్మెల్యే వి.విష్ణుకుమార్ రాజు, ఇరవై సూత్రాల కార్యక్రమం ( వికసిత్ భారత్- స్వర్ణ ఆంధ్ర ప్రదేశ్) అమలు చైర్మన్ లంకా దినకర్, ఏపి ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, తెలుగుభాషా అకాడమీ చైర్మన్ రాయపాటి డేవిడ్ విల్సన్ లు కలిసి పోలవరం ప్రాజెక్టు పనులు ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. ముందుగా ప్రాజెక్టు వ్యూపాయింటు నుండి ప్రాజెక్టు పనులు ప్రగతిని ఇంజనీరింగు బృందం వివరించారు. అనంతరం పవర్ హౌసు, అండర్-స్కియరు కాఫరు డ్యామ్ నుండి గ్యాప్-1 గ్యాప్ -11, స్పిల్ వే, తదితర ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో ఇంజనీరింగు అధికారులు ప్రాజెక్టు పనులు పురోగతిపై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్లు ద్వారా వివరించారు. పర్యటన ఆద్యంతం పనులు పురోగతికి ఇంజనీరింగు అధికారులను అడిగి తెలుసుకుంటూ, త్వరితగతిన పూర్తిచేసేందుకు అన్ని చర్యలను తీసుకుని నిర్ణీత సమయానికి పూర్తి చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటరు ఒ ఎక్స్ అఫీషియో జాయింటు కలెక్టరు వి.అభిషేక్, రంపచోడవరం ఐటిడిఏ పీవో యస్.ప్రశాంత్ కుమార్, ఇంజనీరు ఇన్ చీఫ్ కె.నరసింహామూర్తి, పోలవరం ఇరిగేషన్ యస్ఇ ఆర్.రామచంద్రరావు, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు బొల్లిన నిర్మల కిషోర్, గారపాటి సీతారామాంజనేయ చౌదరి, జిల్లా బిజెపి అధ్యక్షులు సి.హెచ్. విక్రమ్ కిషోర్, మెగా ప్రతినిధులు, ఇంజనీరింగు బృందం, అధికారులు, బిజెపి నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట.. ఒకరి మృతి, 100 మందికి పైగా గాయాలు

**గోపాల్‌పూర్:** ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా భక్తులు తరలి రావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. 100 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడిని కటక్‌కు చెందిన అనిల్ దాస్‌గా గుర్తించారు. పోలీసులు, అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# స్విగ్గీలో వంటగ్యాస్ సిలిండర్ల సరఫరా సేవలు

వంటగ్యాస్ సిలిండర్ల సరఫరాకు హెచ్‌పీసీఎల్‌తో ఒప్పందం చేసుకున్నట్లు స్విగ్గీకి చెందిన క్విక్‌కామర్స్ విభాగమైన ఇన్‌స్టామార్ట్ ప్రకటించింది. హెచ్‌పీసీఎల్ కొత్తగా విడుదల చేసిన 10 కిలో గ్రాముల ఎల్‌పీజీ సిలిండర్ల (హెచ్‌పీ నవ్య)తో ఈ సేవకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపింది. తొలుత బెంగళూరులోని వినియోగదారులు హెచ్‌పీ నవ్య సిలిండర్ల కోసం ఇన్‌స్టా మార్ట్‌లో ఆర్డరు చేసుకోవ్చని, 5 కిలో గ్రాముల సిలిండర్లు కూడా అందిస్తామని ఇన్‌స్టామార్ట్ వెల్లడించింది. గృహ వినియోగ వంట గ్యాస్ కనెక్షన్ లేని వారు కూడా వీటికి ఆర్డరు చేయొచ్చని.. గదుల్లో అద్దెకు ఉండే విద్యార్థులు, ఉద్యోగులకు ఇవి ఉపకరిస్తాయని పేర్కొంది.







## విప్రో లాభం రూ.3,352 కోట్లు..

### ఆదాయంలో 11% వృద్ధి

ప్రముఖ ఐటీ సంస్థ విప్రో ఈ ఏడాది మొదటి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో నికర లాభం రూ.3,352 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే కాలంలో నమోదైన రూ.3,330.4 కోట్లతో పోలిస్తే స్వల్ప వృద్ధిని మాత్రమే (0.6 శాతం) నమోదు చేసింది. కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 10.7 శాతం వృద్ధి చెంది రూ.24,478.6 కోట్లకు చేరింది. గతేడాది రూ.22,134.6 కోట్లుగా ఉంది. విప్రో అందించే ఏఐ సేవలు క్లయింట్ల వ్యాపారానికి ఉపయోగకరంగా మారాయని, ఇది తమపై క్లయింట్లకు ఉన్న నమ్మకాన్ని పెంచిందని విప్రో సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ పల్లియా తెలిపారు. మరోవైపు రెండో త్రైమాసికం అంచనాలను ప్రకటించారు. వచ్చే త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 2574 మిలియన్ డాలర్ల నుంచి 2627 మిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని అంచనా వేశారు. -1.5 శాతం నుంచి ం0.5 శాతం వృద్ధి నమోదు కావొచ్చని పేర్కొన్నారు. ఒక్కో షేరుపై రూ.2 చొప్పున మధ్యంతర డివిడెండ్ ఇచ్చేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

# భారత్‌పై ఇంగ్లాండ్ విజయం

## జో రూట్ సూపర్ ఇన్నింగ్స్

## కోహ్లి, శ్రేయస్ శ్రమ వృథా


ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్ తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్.. రెండో వన్డేలో కంగుతింది. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి తర్వాత ముగిసిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 4 వికెట్ల తేడాతో ఓడింది. జో రూట్ (99 నాటౌట్; 133 బంతుల్లో 9ఐ4) సూపర్ ఇన్నింగ్స్ ఆడడంతో ఇంగ్లాండ్ 234 పరుగుల లక్ష్యాన్ని 44.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మొదట జోఫ్రా ఆర్చర్ (3/47), గస్ అట్కిన్సన్ (3/50), సకిబ్ మహమూద్ (3/52)ల ధాటికి భారత్ 44 ఓవర్లలో 233 పరుగులకే ఆలౌటైంది. విరాట్ కోహ్లి (65; 66 బంతుల్లో 8x4), శ్రేయస్ అయ్యర్ (66; 71 బంతుల్లో 5x4, 2x6) మెరిశారు. ఛేదనలో ఓపెనర్లు బెన్ డకెట్ (0), జాకబ్ బెతెల్ (4) ఆరంభంలోనే ఔటైపోవడం.. కెప్టెన్ బ్రూక్ (16) కూడా ఎక్కువసేపు నిలవకపోవడంతో ఇంగ్లాండ్ 53/3తో కష్టాల్లో పడింది. కానీ తొలి వన్డేలో మాదిరే జో రూట్ పట్టుదలతో నిలవడంతో ఇంగ్లాండ్ విజయానికి దారులు తెరుచుకున్నాయి. సామ్ కరన్ (26), జోస్ బట్లర్ (17), విల్ జాక్స్ (30), గస్ అట్కిన్సన్ (23 నాటౌట్)ల సహకారంతో రూట్ జట్టును గెలిపించాడు. బుమ్రా (1/45), అక్షర్ పటేల్ (1/35), గుర్నూర్ బ్రార్ (2/67), ప్రసిద్ధ్ కృష్ణ (1/52) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఇంగ్లాండ్‌పై ఒత్తిడి తెచ్చినా.. రూట్ గొప్ప పట్టుదలతో ఆడి ఆతిథ్య జట్టుకు విజయాన్నందించాడు.





**నిలబడి, తడబడి..:** టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా ఇన్నింగ్స్‌ను చక్కగా ఆరంభించి, ఒక దశలో అలవోకగా 300 స్కోరు చేసే స్థితిలో కనిపించింది. అయితే 30 ఓవర్ల వరకు ఆధిపత్యం చలాయించిన జట్టు.. తర్వాత అనూహ్యంగా తడబడింది. భారత ఇన్నింగ్స్‌కు మంచి ఆరంభమే దక్కింది. ఫామ్‌తో తంటాలు పడుతున్న రోహిత్ (26; 47 బంతుల్లో 1x4, 1x6) అవతలి ఎండ్‌లో అంత సౌకర్యంగా కనిపించకపోయినా.. కెప్టెన్ శుభ్‌మన్ (31; 30 బంతుల్లో 6x4) మాత్రం చక్కటి స్ట్రోక్ ప్లేతో అలరించాడు. జోరుమీదున్న గిల్‌ను అట్కిన్సన్ ఔట్ చేసినా.. మూడో స్థానంలో వచ్చిన కోహ్లి నిలకడగా ఆడి జట్టును మెరుగైన స్థితికి చేర్చాడు. విరాట్ తనదైన శైలిలో డ్రైవ్ షాట్లు ఆడుతూ, బౌండరీలు కొడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. రోహిత్.. అట్కిన్సన్ బౌలింగ్‌లో ఒక సిక్సర్ బాదినా, ఆ తర్వాత మళ్లీ తడబాటును కొనసాగించాడు. స్పిన్నర్ జాక్స్ బౌలింగ్‌లో రోహిత్ స్వీప్ చేయబోయి వికెట్ కీపర్‌కు దొరికిపోవడంతో 104 పరుగుల వద్ద భారత్ రెండో వికెట్ కోల్పోయింది. కాసేపటికే ఇషాన్ (1) కూడా ఔటైపోయినా.. కోహ్లికి శ్రేయస్ జతకలవడంతో భారత్‌కు ఇబ్బంది లేకపోయింది. ఇద్దరూ నిలకడగా ఆడుతూ జట్టును పటిష్ఠ స్థితికి చేర్చారు. కోహ్లి సరిగ్గా 50 బంతుల్లో అర్ధశతకాన్నందుకున్నాడు. శ్రేయస్ కూడా అర్ధసెంచరీకి చేరువ కాగా.. 31 ఓవర్లకు భారత్ 177/3తో 300 స్కోరుపై కన్నేసింది. కానీ తర్వాతి ఓవర్లో ఆర్చర్.. కోహ్లిని ఔట్ చేయడంతో ఆట మలుపు తిరిగింది. తర్వాత చకచకా వికెట్లు పడ్డాయి. గత మ్యాచ్‌లో విలువైన అర్ధశతకాలు సాధించిన సుందర్ (1), అక్షర్ (1) ఈసారి తేలిపోయారు. అక్షర్‌తో పాటు దూబె (0)ను ఆర్చర్ ఒకే ఓవర్లో ఔట్ చేశాడు. ఒక ఎండ్‌లో శ్రేయస్ పోరాడుతున్నా.. అతడికి సహకరించేవారు కరవయ్యారు. 210 పరుగుల వద్ద భారత్ ఎనిమిదో వికెట్ కోల్పోగా.. సకిబ్ వేసిన 43వ ఓవర్లో బుమ్రా మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో చెలరేగిపోవడంతో 18 పరుగులు వచ్చాయి. 43 ఓవర్లకు 232 పరుగులు చేసిన భారత్.. 270-280 పరుగులు చేస్తుందనిపంచింది. కానీ తర్వాతి ఓవర్లో అట్కిన్సన్.. శ్రేయస్, ప్రసిద్ధ్ (0)లను ఔట్ చేయడంతో 6 ఓవర్లు ఉండగానే ఇన్నింగ్స్‌కు తెరపడింది.





## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం సెషన్‌లో ఊగిసలాడాయి. పశ్చిమాసియా ఉద్రిక్తత పరిస్థితులు, చమురు ధరలు పెరగడం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా-ఇరాన్ మధ్య మ-రోసారి ఘర్షణలు ప్రాంతీయ యుద్ధానికి దారితీయొచ్చనే భయాలు నెలకొన్నాయి. దీంతో ప్రపంచ మార్కెట్లపై ప్రభావం పడింది. ఈ క్రమంలోనే దేశీయ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. చివరికి సెన్సెక్స్ 1.44 పాయింట్ల లాభంతో 77,186.87 వద్ద ముగిసింది. నిఫ్టీ 5.75 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్‌టెక్, ఇండిగో, బజాజ్‌ఫైనాన్స్, మారుతీ,మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ కంపెనీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, బీఈఎల్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీబ్యాంక్, ఎన్‌టీపీసీ, ట్రెంట్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 96.34 వద్ద ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ చమురు ధర 84.76 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,033 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు ఆసియా మార్కెట్లలో దక్షిణకొరియా కోస్పి, జపాన్ నిక్కీ వంటి మార్కెట్లు కూడా నష్టాలను చవిచూశాయి.



## డీజిల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్ పెంపు..

పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ.. కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్‌ను పెంచింది. అయితే, పెట్రోల్‌పై సుంకాన్ని మాత్రం తగ్గించింది. జులై 16 నుంచి రెండు వారాల పాటు ఈ నిర్ణయాలు అమల్లో ఉంటాయని తెలిపింది. తాజా నిర్ణయంతో లీటర్ డీజిల్‌పై విండ్ ఫాల్ ట్యాక్స్ రూ.8.5 నుంచి రూ.15.5కు పెరిగింది. విమాన ఇంధనం లీటర్‌పై ఈ పన్నును రూ.7.5 నుంచి రూ.14.5కు పెంచింది. ఇక, లీటర్ పెట్రోల్‌పై ఎగుమతి సుంకాన్ని రూ.4 నుంచి రూ.2.5కి తగ్గించింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు అకస్మాత్తుగా పెరిగినప్పుడు, చమురు కంపెనీలకు భారీ లాభాలు వస్తాయి. ఇలాంటి అదనపు లాభాలపై ప్రభుత్వం పన్ను రూపంలో కొంత మొత్తాన్ని వసూలు చేస్తోంది. ఈ నిధులను దేశీయ అవసరాలకు, సంక్షేమ పథకాలకు ఉపయోగిస్తోంది.

# వన్డే ప్రపంచకప్‌లో సెమీస్‌కు ముందు సూపర్-7

### టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8కు బదులు సూపర్-10

### వన్డే, టి20 ప్రపంచకప్‌లలో కీలక మార్పులు

### వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ నుంచి అమలు

రాబోయే ఐసీసీ టోర్నీల ఫార్మాట్లలో కీలక మార్పులు చూడబోతున్నాం. 2027 వన్డే ప్రపంచకప్‌లో సెమీస్‌కు ముందు సూపర్-7 దశ జరగనుంది. 2028 టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8కు బదులు సూపర్-10 నిర్వహించనున్నారు. టోర్నీలపై ఆసక్తిని జట్ల మధ్య పోటీని పెంచేందుకు ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని ఐసీసీ తెలిపింది. 2023 వన్డే ప్రపంచకప్‌లో 10 జట్లు పోటీపడగా.. వచ్చే ఏడాది 14 జట్లు తలపడనున్నాయి. 10 జట్లు నేరుగా టోర్నీకి అర్హత సాధిస్తాయి. క్వాలిఫయర్స్ ద్వారా మరో నాలుగు జట్లు ఎంపికవుతాయి. 11వ స్థానంతో ప్రపంచకప్‌నకు వచ్చే జట్టు.. నేరుగా గ్రూప్ దశలో తలపడుతుంది. 12, 13, 14వ స్థానాలతో టోర్నీకి అర్హత సాధించిన జట్లు గ్రూప్ దశకు ముందు 'సూపర్ సిరీస్' రౌండ్ ఆడతాయి. ఇందులో అగ్రస్థానం దక్కించుకున్న టీమ్ గ్రూప్ దశకు అర్హత సాధిస్తుంది. గ్రూప్ దశలో 12 జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోతాయి. ప్రతి గ్రూప్ నుంచి 3 జట్లు, మొత్తంగా నాలుగో ఉత్తమ టీమ్ సూపర్-7 దశకు చేరుకుంటాయి. అక్కడ రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడి టాప్-4లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరుకుంటాయి. సంయుక్త ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వే నేరుగా ప్రపంచకప్‌నకు అర్హత పొందుతాయి. నమీబియా అసోసియేట్ దేశం కావడంతో అర్హత టోర్నీ ఆడాల్సివుంటుంది.



దక్షిణాఫ్రికా, జింబాబ్వే కాకుండా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 8 ఉత్తమ జట్లు టోర్నీకి అర్హత పొందుతాయి. టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8 విధానానికి బదులు సూపర్-10ను ప్రవేశపెట్టింది ఐసీసీ. మొదట 20 జట్లను అయిదు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి రెండు టీమ్‌లు సూపర్-10 దశకు చేరుకుంటాయి. ఇక్కడ అయిదేసి జట్లు రెండు గ్రూపులుగా విడిపోతాయి. ప్రతి గ్రూప్ నుంచి అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు నేరుగా సెమీస్‌కు చేరుతాయి. మిగతా రెండు బెర్తుల కోసం 2వ స్థానంలో ఉన్న జట్లు ప్రత్యర్థి గ్రూప్‌లోని మూడో స్థానంలో ఉన్న టీమ్‌లను ఢీకొంటాయి. ఇందులో గెలిచిన జట్లు సెమీస్ చేరుకుంటాయి. 2028లో జరిగే టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది.

జనం వార్త



# ఫారియా అబ్దుల్లా గ్లామర్ టచ్

మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ నటి ఫారియా అబ్దుల్లా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'జాతిరత్నాలు' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ భామ, తొలి చిత్రంతోనే సూపర్ హిట్‌తో పాటు మంచి గుర్తింపును సొంతం చేసుకుంది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించినప్పటికీ, తొలి సినిమా స్థాయి విజయాన్ని మాత్రం ఇప్పటివరకు అందుకోలేకపోయింది. అయినప్పటికీ హీరోయిన్ పాత్రలతో పాటు ప్రాధాన్యమున్న ఇతర పాత్రలను కూడా ఎంపిక చేసుకుంటూ తన కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తోంది. సినిమాల్లో తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఫారియా సోషల్ మీడియాలోనూ అదే జోరు కొనసాగిస్తోంది. ఎప్పటికప్పుడు స్టైలిష్ ఫోటోషూట్లతో అభిమానులను అలరిస్తూ వస్తుంది. తాజాగా ఆమె షేర్ చేసిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# 23న జననాయగన్ రిలీజ్

## పోస్టర్ విడుదల

తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఆఖరి చిత్రం 'జన నాయగన్'. ఈ ఏడాది సంక్రాంతికే థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రం సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ చిత్రాన్ని ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ మేరకు ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ని ఆవిష్కరించింది. 'అగ్ని పరీక్షలో నిలిచి.. కాలం మలిచిన రూపం.. పోరాటం ఎంత కఠినంగా ఉంటే.. విజయం అంత ఘనంగా ఉంటుంది' అనే వ్యాఖ్యల్ని జోడించింది. హెచ్.వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలకపాత్రలో నటించింది.

# మూడేళ్లుగా ఒడిదుడుకులు ఎదుర్కొన్నా

## నన్ను ధైర్యంగా నిలబెట్టింది నా భార్యనే: అఖిల్

మూడేళ్లుగా ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నానని.. తన భార్య జైనబ్ వెన్నంటే ఉండి ధైర్యాన్ని ఇచ్చిందన్నారు నటుడు అఖిల్. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'లెనిన్' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుంటూరులో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రబృందానికి కృతజ్ఞతలు చెప్పిన అఖిల్ తన కుటుంబం గురించి మాట్లాడారు. నేను జైనబ్‌ను ఇంట్లో బంగారు తల్లి అని పిలుస్తాను. మూడేళ్లుగా నేను బాధలో ఉన్నప్పుడు నా పక్కనే ఉంటూ నన్ను ఎంతో సపోర్ట్ చేసింది. నాకు గైడ్‌లా ఉంటూ ధైర్యాన్నిచ్చింది. ఇక, లెనిన్ విడుదలైన అనంతరం జరిగిన ఈవెంట్‌లో నేను నాన్నను హగ్ చేసుకున్నాను. అందులోనే నేను పదేళ్లుగా దాచుకున్న ఎమోషన్స్ అన్నీ బయటకు వచ్చాయి. ఇన్నేళ్లలో నాన్న నన్ను ఒక్కసారి కూడా తిట్టలేదు. నిరుత్సాహపర్చలేదు. నాకు సర్వస్వం ఆయనే. ఒక స్నేహితుడిలా ఈ జర్నీలో తోడుగా ఉన్నాడు. 'లెనిన్'ను తన భుజాలపై మోశాడు. అక్కినేని అభిమానులకు మంచి సినిమాను అందించాలనే తపనతో వర్క్ చేశాడు' అని అఖిల్ చెప్పారు. ఇక అభిమానుల గురించి మాట్లాడుతూ.. 'ఎన్నో జన్మల పుణ్యం చేస్తే ఇలాంటి అభిమానులు దొరుకుతారు. ఫ్యాన్స్ కోసం అయినా హిట్ కొట్టాలని మా ఆవిడతో ఎప్పుడూ చెప్పేవాడిని. నన్ను నమ్మిన ప్రేక్షక దేవుళ్లందరికీ ఒక్కటే మాట చెబుతున్నాను. నేనేం కాలర్ ఎగరేయను.. విజయం సాధించాం అని గర్వపడను. ఇప్పటి నుంచి నా కొత్త ప్రయాణం మొదలవుతోంది. నేను చేయాలనుకుంటున్న యుద్ధాన్ని ప్రశాంతంగా చేస్తానని అన్నారు.






# ప్రభాస్ 'ఫౌజీ' అప్‌డేట్ వచ్చేసింది

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఫౌజీ'. ఈ సినిమా కోసం ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా టీమ్ వారికి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ చిత్ర విడుదల తేదీ ప్రకటించింది. డిసెంబర్ 3న 'ఫౌజీ' విడుదల కానున్నట్లు తెలుపుతూ ఓ కొత్త పోస్టర్ పంచుకుంది. 'అజ్ఞాతపర్వం ముగిసింది.. ఇక తిరుగుబాటు మొదలైంది..' అంటూ పంచుకున్న ఆ పోస్టర్‌లో '1932 నుంచి మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు' అని రాసి ఉన్న స్టాంప్ ఆకట్టుకుంటోంది. ఇందులో ప్రభాస్ మునుపెన్నడూ చూడని లుక్‌లో కన్పించాడు. యుద్ధంలో ఒంటి నిండా రక్తంతో, తుపాకీపై చేయి పెట్టి కూర్చొని ఉన్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి నటిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ చివరి దశలో ఉంది. 75 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో మరో మూడు యాక్షన్ ఘట్టాలతో పాటు కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించాల్సి ఉంది. ఇక ఈ సినిమా నుంచి త్వరలోనే ఓ లిరికల్ సాంగ్‌ను కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 'సీతారామం' తర్వాత ఫౌజీ కథను రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టిందని గతం లో హను రాఘవపూడి తెలిపారు. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# నా ఫోటోలు తీయకండి ప్లీజ్: మౌనీరాయ్

బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. 'నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా' అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.






# ఆగస్ట్ 15న రానున్న హుషారు పిట్టలు

అన్ను, వాసవి గణెళిషన్ కాంబోలో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్రక్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి టోంగా టోంగా అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్.ఎస్.చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు. అయితే ఇదే సినిమాను ఏ తమిళంలో, మలయాళంలో తీసి టీజర్‌ను విడుదల చేస్తే అందరూ ప్రశంసించేవారు. కానీ తెలుగు వాళ్లు మనకు చిన్న చూపు. తెలుగులో హుషార్ పిట్టలు ట్రెండ్ సృష్టించబోతుంది. విడుదల తరువాత ఇతర భాషల్లో ఈ తెలుగు సినిమా గురించి మాట్లాడుకుంటారు. పుట్ట చిట్టి పాత్రకు వాసవి ప్రాణం పోసింది. అందుకే ఆమె కాళ్లు మొక్కుతున్నాను. ఈ రోజు మా కాన్ఫిడెంట్‌కు కారణం ఏమిటో ఈ సినిమా విడుదల తరువాత అందరికి తెలుస్తుంది' అన్నారు. హీరో అన్ను మాట్లాడుతూ.. నా ఫేవరెట్ సింగర్ మంగ్లీ నా సినిమాలో పాట పాటడం ఆనందంగా ఉంది. ఈ పాటకు మంచి ట్యూన్‌ను చరణ్ అర్జున్ అందించారు. ఈ రోజు నా ఆత్మవిశ్వాసానికి కారణం దర్శకుడు బిక్షు, నిర్మాత వెంకట్. టీజర్ విడుదల చేశాం. చాలా వైరల్ అయ్యింది. టీజర్ చూసి అందరూ మిస్ అండర్ స్టాండింగ్ చేసుకున్నారు. సినిమా చూసిన తరువాత అందరి ఆలోచన మారిపోతుంది. సినిమాలో అసలైన మ్యాటర్ సినిమాలో ఉంది. నా సినిమాలో ఉన్న కంటెంట్ నాతో ఇంత కాన్ఫిడెన్స్‌ను ఇచ్చింది' అన్నారు. హీరోయిన్ వాసవి గణెళిషన్ మాట్లాడుతూ.. దర్శకుడు, నిర్మాత సజేషన్‌తో ఈ సినిమా చేశాను. సురేష్ ప్రొడక్షన్స్, బెక్కెం వేణుగోపాల్ సహకారంతో ఈ సినిమా స్టాంగ్ అయ్యింది. టోంగా.,. టోంగా పాట అందరికి నచ్చుతుంది. ఈ సినిమా టీజర్‌తో నాకు చాలా నెగెటివ్ కామెంట్స్ పెట్టారు. అయితే వాసవి గణెళిషన్ వేరు? పుట్ట చిట్టి వేరు.. ఎవ్వరూ ఏమనుకున్నా సినిమా చూసిన తరువాత మీరు కూడా అర్థం చేసుకుంటారని అనుకుంటున్నాను' అన్నారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com